నవతెలంగాణ
మెదక్
1
సోమవారం | 10 మార్చి 2025 | www.navatelangana.com

నూతన వస్త్రధారణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని మీర్ఖాన్‌పేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ యువనాయకులు డబ్బేటి రాజేశ్వర్‌గౌడ్, స్వప్న దంపతుల కొడుకు, కూతురి పుట్టు పంచల నూతన వస్త్రాధారణ కార్యక్రమం నిజాంపేట గ్రామ కూడలిలోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ నూతన వస్త్రాధారణ కార్యక్రమానికి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డిలు వేరువేరుగా హాజరై చిన్నారులను ఆశీర్వదించి రాజేశ్వర్‌గౌడ్, స్వప్న దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భోజ రెడ్డి, మాజీ సర్పంచులు దిగంబర్ రెడ్డి, ఈశ్వరప్ప. రఘుపతి రెడ్డి, మాజీ ఎంపిటిసి లింగారెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, మాజీఎంపీపీ మల్లేశం, సీనియర్ నాయకులు రాధా కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప జాతరలో పాల్గొన్న రాష్ట్ర మాజీ చైర్మెన్ బిక్షపతి



నవతెలంగాణ-జోగిపేట, వట్‌పల్లి

వట్‌పల్లి మండలంలోని సాయిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ, గజస్థంభం ప్రతిష్టపనలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైరెన్ మఠం భిక్షపతి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేప ట్టారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాయిపేట మాజీ సర్పంచ్ మల్లేశం,వైస్ ఎంపి పి బసవరాజ్, మాజీ ఎంపిటిసిలు తమ్మన్నగారి సంగన్న,శివాజీ,రాజు,గ్రామ ఉప సర్పంచ్ గోపాల్, మొగులయ్య,రమేష్,శేఖర్,మధు,సంగమేశ్వర్,బీరప్ప, గ్రామస్థులు నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలు గెలిచారుగా అభివృద్ధి చేసి చూపించండి

ములుగు టు మంచిర్యాల వరకు 8 లైన్ల రోడ్డు వేయించు
బండి సంజయ్‌కి పొన్నం సవాల్



నవతెలంగాణ-కొమురవెల్లి

బీజేపీ ఎమ్మెల్సీలను గెలిపించినందుకు తెలంగాణ ప్రజలకు అభివృద్ధి చేసి చూపించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. ఆదివారం సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొమురవెల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండాలని మల్లన్న ఆశీర్వాదం తీసుకున్నానని తెలిపారు. మాకు రంజాన్ గిఫ్ట్ అంటున్న బండి సంజయ్ మీ ఎమ్మెల్సీ గెలిచినందుకు రాజీవ్ రహదారి మెదక్ జిల్లా ప్రారంభం ములుగు నుంచి మంచిర్యాల వరకు 8 లైన్ల రోడ్డు వేయించి తెలంగాణ ప్రజలకు గిఫ్టుగా ఇస్తే బాగుంటుందన్నారు. ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని హితవు పలికారు. బిజెపికి ఓటు వేసిన వాళ్లంతా హిందువులు మా పార్టీకి ఓట్లేసిన ప్రజలంతా పాకిస్తాన్ వాళ్ల అని ప్రశ్నించారు. వాళ్ల గెలుపు మా పార్టీకి వచ్చిన చె ల్లని ఓట్ల కన్నా వాళ్ల మెజారిటీ తక్కువ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చివరి సమయంలో రూ లక్ష 80వేల కోట్ల అభివృద్ధి పనులకు సాంక్షన్ లెటర్లు ఇచ్చి, చేసిన పనులకు రూ.40 వేల కోట్లు బిల్లులు బాకీ పెట్టి ఆర్థిక సంక్షోభం సృష్టించారని, అయినా కాంట్రాక్టర్లకు మెల్లమెల్లగా బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో 5-10 లక్షలకు ఆరోగ్య శ్రీ పెంచుకున్నామన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణం, రూ.200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కి గ్యాస్ అందిస్తున్నామని తెలిపారు. మార్చి 31 లోగా రైతు భరోసా నిధులు పూర్తిగా విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఈ నెలలో అందిస్తారు.కొత్త రేషన్ కార్డులు.సన్న వడ్లకు 500 బోనస్, హాస్టల్ పిల్లలకు మెస్ చార్జీలు కాస్మొటిక్ చార్జీలు పెంచమన్నరు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెండు లక్షల రైతు రుణమాఫీ చేశామన్నారు. మండల మహిళా సమైక్య సంఘాల ద్వారా 600 బస్సులు వస్తున్నాయన్నారు. ధాన్యం కొనుగోలు గోడౌన్ రైస్ మిల్ అక్కడే ఉండేలా చేసి మహిళా సంఘాల ద్వారా ఆర్థిక వృద్ధి సాధించడం కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో తాగు నీటిని ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురండి సమస్య పరిష్కారం కాకపోతే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి దృష్టికి తీసుకురావాలన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. పెట్టుబడులు తీసుకొస్తున్నమని, ట్రిపుల్ ఆర్ తీసుకొచ్చి అభివృద్ధి కొరకు కృషి చేస్తున్నామన్నారు. ఆర్టీసీలో మొన్ననే డిఎ ఇచ్చామని. కారుణ్య నియామకాలు చేపట్టామని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు శాసన సభలో చట్టబద్ధం చేస్తాన్నారు. తరువాత ఢిల్లి వెళ్లి మద్దతు కోరుతామన్నారు. బీసీ కుల గణన లోస్వచ్ఛందంగా సమాచారం సేకరణ జరిగింది.. సమాచారం ఇవ్వని వారికి మరోసారి అవకాశం ఇచ్చామన్నారు. ఎస్సీ వర్గీకరణ చేస్తున్నామన్నారు. అందరి సహకారం కోరుతున్నామని, మండల స్థాయి నాయకులు ఇంకా సమేకం కాకపోవడం వళ్ళే ఇబ్బందులు వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నెల నుంచే బిఆర్ఎస్ విమర్శలు చేస్తూ బదనాం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

నవతెలంగాణ-సంగారెడ్డి



'ప్యారా నగర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా గత 30 రోజులుగా నిరసనలు చేస్తున్న మహిళలు, ప్రజ లతో పటాన్చెరు ఎమ్మె ల్యే గూడెం మహిపాల్ రెడ్డి అమర్యాదగా మాట్లా డటం సరికాదని సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయ రాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల రోజులుగా నల్లవల్లి ప్యారా నగర్ డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా రైతులు శాంతి యుతంగా ఆందోళన చేస్తున్నారన్నారు. వారు తమ సమస్యను పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే వద్దకు వెళ్ళగా 'ఈరోజు నేను గుర్తుకువచ్చానా? ఇన్ని రోజుల తర్వాత ఇప్పుడొస్తారా? ఇప్పుడు నా చేతిలో ఏం లేదూ.. డంపింగ్ యార్డ్ ఏర్పాటు ఏం చేసినా ఆగదు' అని ఎమ్మెల్యే ఖరాకండిగా చెప్పడం చాలా బాధాకరమన్నారు. ఆందోళనలో ఉన్న ప్రజల పట్ల ఈ విధంగా వ్యవహరించటం ఏమిటని ప్రశ్నించారు. తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహా రించుకోవాలన్నారు. డంపింగ్‌యార్డ్ సమస్య పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పౌల్ట్రీ ఫామ్ ఢమాల్





- ఖాళీ అవుతున్న బయిలర్ ఫారాలు
- వింత వ్యాధితో రోజూ వేళల్లో కోళ్ల మృత్యువాత
- మెదక్, సంగారెడ్డి జిల్లాలో 10 మండలాల్లో ఎఫెక్ట్
- సీఆర్డీ, కొక్కెర వ్యాధిగా ప్రాథమిక నిర్ధారణ
- బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌తో తగ్గిన చికెన్, గుడ్ల వినియోగం
- కుటీర పరిశ్రమగా గుర్తించి ఆదుకోవాలనే డిమాండ్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

బర్డ్ ఫ్లూ, అంతుచిక్కని వ్యాధుల ప్రభావంతో పౌల్ట్రీ ఫామ్స్ ఢమాల్ అన్నాయి. రోజూ వేల సంఖ్యలో కోళ్ల మృత్యువాత పడుతుండడంతో బయిలర్ ఫామ్స్ ఖాళీ అవుతున్నాయి. సీఆర్డీ, కొక్కెర వ్యాధితో కోళ్లు చనిపోతున్నాయని ప్రాథమిక నిర్ధారణకు వచ్చినా బర్డ్ ఫ్లూ భయాందోళన మాత్రం పోవట్లేదు. ఇప్పటికే చికెన్, కోడి గుడ్ల వినియోగం తగ్గింది. మరో పక్క కోళ్లు చనిపోతున్నా కంపెనీలు పట్టించుకోవడంలేదు. లక్షల్లో పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయి ఆందోళనకు గురవుతున్నారు. కుటీర పరిశ్రమగా గర్తించి ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరుతున్నారు. ఇప్పటి వరకు బాయిలర్, లేయర్ కోళ్లు మాత్రమే చనిపోగా తాజాగా నాటుకోళ్లు సైతం వేల సంఖ్యల్లో మృత్యువాత పడుతున్నాయి. వ్యాధి సోకే ప్రాంతాలు పెరగడంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇప్పటికే 10 మండలాల్లో 50 వేల కోళ్లు వరకు చనిపోయాయి.

అంతు చిక్కని వ్యాధి...నిత్యం వేలల్లో కోళ్లు మృత్యువాత

రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోనూ అంతు చిక్కని వ్యాధి సోకి నిత్యం ఫారం, నాటు కోళ్లు వేల సంఖ్యల్లో మృత్యువాత పడుతున్నాయి. ఆదివారం మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలంలోని జంగరాయి, గువ్వలపల్లి గ్రామాల్లో అంతు చిక్కని వ్యాధి సోకి 12 వేల కోళ్లు చనిపోయాయి. నర్సాపూర్ మండలంలోని లింగాపూర్‌లో 3500 నాటు కోళ్లు చనిపోయాయి. పక్కనే బాయిలర్ ఫామ్స్ ఉండడంతో అక్కడి కోళ్లకు సోని వైరస్ నాటు కోళ్లకు సోకినట్లుగా అనుమానిస్తున్నారు. కొల్చారం మండంలోని నాయినిజలాలపురం, టేక్మాల్ మండలంలోని ఎల్లుపేటలో అంతుచిక్కని వైరస్ వల్ల 6 వేలకు పైగా కోళ్లు చనిపోయాయి. కౌడిపల్లి మండలంలోని కంచన్‌పల్లిలో 8 వేలు, నర్సాపూర్ మండలంలోని అచ్చంపేటలో వెయ్యి, శివంపేట మండలంలోని గూరూరు తండాలో 3 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. సంగారెడ్డి జిల్లాలోని చౌటకూర్ మండలంలోని బొమ్మారెడ్డి గ్రామంలో రెండు కోళ్ల ఫారాల్లో మూడు రోజుల వ్యవధిలోనే 12 వేల కోళ్లు, పుల్కల్ మండలంలో 8 వేల కోళ్లు చనిపోయాయి. వారం రోజుల వ్యవధిలోనే 50 వేలకు పైగా కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఇప్పటికే 10 మండలల్లో కోళ్లు చనిపోయినందున ఇంకా విస్తరించే ప్రమాదముందని పౌల్ట్రీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాధి నిర్ధారణలో చోద్యం చూస్తున్న పశు సంవర్ధక శాఖ

వారం రోజులుగా మెదక్, సంగారెడ్డి జిల్లాలో బాయిలర్, నాటు కోళ్లు వేల సంఖ్యల్లో మృత్యువాత పడుతున్నాయి. అంతు చిక్కని వ్యాధి వల్ల కోళు చనిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. కోళ్లు కుప్పలు తెప్పలుగా చనిపోవడానికి కారణమేంటనేది నిర్ధారించాల్సిన పశు సంవర్ధక శాఖ మాత్రం చోద్యం చూస్తుంది. ఏ వ్యాధి వల్ల కోళ్లు చనిపోతున్నాయో..? ఏ రకమైన వైరస్ సోకుతుందో..? వ్యాధి నివారణకు చర్యలేమిటీ..? తీసుకోవల్సిన జాగ్రత విషయంలో పశుసంవర్ధక శాఖ అధికరులు మొక్కుబడి ప్రకటనలకే పరిమితమవుతున్నారు. కోళ్లు చనిపోయాయని సమాచారం తెల్సుకొని రక్త నమూనల శాంపిల్స్ పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శను ఎదుర్కొంటున్నారు. తొలుత బర్డ్ ఫ్లూ అనుకుని రైతులు ఆందోళన చెందారు. ఆ తర్వాత సరైన దాణ, నీరు ఇవ్వడంలో లోపం, ఎండల తీవ్రత అని చెప్పారు. ఇటీవల మాత్రం సీఆర్డీ క్రానిక్ సెర్ఫరేషన్ డిసీస్ అని ప్రాథమికంగా నిర్ధారించారు. శాంపిల్స్ ల్యాబ్‌కు పంపిన తర్వాత అధికారికంగా ఇంకా నిర్ధారణ చేయలేకపోవడంతో రైతుల్లో ఆందోళన కొనసాగుతుంది.

ఖాళీ అవుతున్న కోళ్ల ఫారాలు... తగ్గిన చికెన్, గుడ్ల వినియోగం

పక్క రాష్ట్రాల్లోల బర్డ్ ఫ్లూ సోకిందన్న వార్తలు వెలువడడంతో తెలంగాణలోనూ ప్రజలు చికెన్, కోడి గుడ్ల వినియోగాన్ని తగ్గించారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో రోజూ వేల సంఖ్యల్లో కోళ్ల మృత్యువాత పడుతుండడంతో జనం చికెన్ తినాలంటేనే భయపడుతున్నారు. ఫలితంగా చికెన్ సెంటర్లు వెలవెలబోతున్నాయి. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్స్‌లో చికెన్ వంటలు తగ్గిపోయాయి. ఇంత వరకు బర్డ్ ఫ్లూ వైరస్ సోకినట్లు నిర్ధారణ కాకపోయినా ఇప్పటికీ ఆ ప్రబావం కనిపిస్తుంది. చికెన్ వ్యాపారం దెబ్బతినడంతో చికెన్ సెటర్లు, హోటళ్ల యజమానులు నష్టపోయారు. మరో పక్క బయిలర్ కోళ్లను పెంచుతున్న రైతులు ఫారాలను ఖాళీ చేస్తున్నారు. ఇప్పటికే వైరస్ సోకి వేలల్లో కోళ్లు చనిపోయాయి. మిగతావి కూడా ఎవరూ కొనట్లేదు. 45 రోజుల బ్యాచ్ తర్వాత తిరిగి కోడి పిల్లల్ని పెంచడమే మానేశారు. దీంతో అనేక ప్రాంతాల్లో కోళ్ల ఫారాలు ఖాళీగా కనిపిస్తునాన్నాయి.

లక్షల్లో పెట్టుబడులు... దుఖంలో పౌల్ట్రీ రైతులు

పౌల్ట్రీ వ్యాపారం కాస్త లాభసాటిగా ఉందన్న బావనతో చాలా మంది రైతులు తమ భూముల్లో 10 వేల నుంచి 30 వేల కోళ్ల పెంపకం కోసం షెడ్స్ వేసుకున్నారు. షెడ్ సైజ్‌ను బట్టి రూ.20 నుంచి రూ.50 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. కొందరు రైతులు కోళ్ల ఫారాలను కౌలుకు తీసుకుని నడుపుతున్నారు. బయిలర్ కోళ్ల పెంపకం 45 రోజులకు ఒక బ్యాచ్ చొప్పున ఏడాదిలో మూడు నాలుగు బ్యాచ్‌ల్లో కోళ్లను పెంచుతారు. సుగుణ, శ్రీరామా ఇతర కంపెనీలు పిల్లలు, దాణ, వాక్సిన్స్, మందులు ఇచ్చి పెంచినందుకు కిలోకు ఒక ధర చొప్పున రైతులకు చెల్లిస్తారు. ఒక వేళ కోళ్లు చనిపోతే వాటి పెంపకం కోసం కంపెనీ పెట్టిన ఖర్చంతా రైతులే భరించాలి. ప్రస్తుతం కోళ్లు చనిపోతున్నాయని కంపెనీలకు చెబితే ఏ కంపెనీ ప్రతినిధులు కూడా స్పందించడంలేదు. కనీసం ఏం చేయలో కూడా చెప్పట్లేదు. పైగా దాణ కూడా సకాలంలో సరఫరా చేయట్లేదు. గుడ్లు, కోళ్లు, దాణ రవాణా చేసే వాహనాలు వైరస్ సోకిన ఫారాలకు పంపడంలేదు. పెట్టిన పెట్టుడులే కాదు చనిపోతున్న కోళ్ల నష్టాన్ని కూడా మేమే భరించాల్సి వస్తుందని నష్టపోయిన పౌల్ట్రీ రైతులు లింబాద్రి, సతీష్ గౌడ్, ప్రసాద్, పాపయ్య అనే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటీర పరిశ్రమగా గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలి. కోళ్లు చనిపోయినందున ఆ నష్టాన్ని కంపెనీలే భరించాలంటున్నారు.

బర్డ్ ఫ్లూ పక్షుల్లో ప్రాణాంతకం...జాగ్రతలు కీలకం

బర్డ్ ఫ్లూ వ్యాధి పక్షుల్లో ప్రాణాంతకమైంది. ఇది ఎవియాన్ ఇన్ఫ్లుఎంజా అనే వైరస్ ద్వారా వ్యాప్తిస్తుంది. కోళ్ల లాలాజలం, విసర్జక వ్యర్థాల్లో వైరస్ రూపంలో ఉంటుంది. వ్యాధి సోకిన కోళ్లు తీవ్ర శ్వాసకోశ ఇబ్బందులు, జ్వరం, దగ్గు, కండరాల నొప్పి, విరేచనాలు కనిపిస్తాయి. గాలి ద్వారా వ్యాపించే వైరస్ కావడంతో జాగ్రతలు పాటించాలని సూచిస్తున్నారు. షెడ్ చుట్టు సున్నం, బ్లీచింగ్ తరచూ చల్లాలి. శానిటైజ్ చేయాలి. ఫారంలో పని చేసే వాళ్లు గ్లౌజులు, మాస్కులు ధరించాలి. షెడ్ లోపల సోడియం, హైడ్రోక్లోరైడ్, ఫార్మాలిన్ ద్రవణంతో శుభ్రపర్చాలి. చనిపోయిన కోళ్లను అడుగుల గొయ్యిలో పాతిపెట్టాలి. చికెన్, గుడ్లను 75 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో ఉడికించి తినొచ్చు.

ప్రయివేటు వాహనాలకు అడ్డాగా బస్టాండ్

- ఆర్టీసీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి
- జోగిపేట 17వ వార్డు మాజీ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం ప్రయివేటు వాహనాలకు అడ్డంగా మారిందని అందోల్ జోగిపేట మున్సిపల్ 17వ వార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు ఆరోపించారు. ఆదివారం ఆయన బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రయివేటు వాహనాలతో బస్టాండ్ ప్రాంగణం ఇరుకుగా మారుతుందన్నారు. తక్షణమే ప్రయివేటు వాహనాలు బస్టాండ్ లోపలికి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ప్రవేట్ వాహనాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని అసహనం వ్యక్తం చేశారు. వందల సంఖ్యలో ప్రయివేటు వాహనాలు బస్టాండ్‌లో.. పార్కింగ్లో కాకుండా ఇతర చోట్ల పెట్టడంతో అటు బస్సులకు, ఇటు ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. బస్టాండ్ ప్రాంగణం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని సూచించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకువెళ్లి ఆర్టీసీ బస్సులకు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానన్నారు.

గుడిసెకు నిప్పంటించిన దుండగులపై చర్యలు తీసుకోవాలి

- అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గం
- బాధితులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి
- సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి యాదగిరి డిమాండ్

నవతెలంగాణ-సంగారెడ్డి



స్థానిక రెవెన్యూ కాలనీలో పేదల గుడిసెలకు నిప్పంటించిన దుండగులపై వెంటనే కఠిన చర్యలు తీసుకో వాలని సీపీఐ(ఎం) సంగారెడ్డి ఏరియా కార్యదర్శి ఎం.యాదగిరి డిమాండ్ చేశారు. దగ్ధమైన గుడిసెలను సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి పట్టణంలోని రెవెన్యూ కాలనీలో గత 10 ఏండ్ల నుంచి పేదలు గుడిసెలు వేసుకొని జీవిసున్నారన్నారు. అయితే ఆ పేద ప్రజల గుడిసెలను గుర్తు తెలియని వ్యక్తులు రాత్రుళ్ల వచ్చి తగులబెడుతు న్నారని.. ఇది దుర్మార్గమన్నారు. గతరాత్రి కూడా గుడిసెలకు నిప్పం టించడంతో.. మొత్తం కాలిపోయి ఆస్తి నష్టం జరిగిం దన్నారు. పనికి పోతే తప్పా పొట్ట నిండని ఆ పేదలకు ఇది తీవ్ర నష్టం చేకూర్చిందన్నారు. కొందరు కక్షగట్టి పేదల గుడిసెలు తగలబెడు తున్నా..ఇప్పటివరకు అధికారులు పట్టించుకోకపోవడం చాలా దారుణమన్నారు. గుడిసెల్లో బియ్యం, టీవీలు, ఫ్రిజ్జులు,ఫ్యాన్లు డబ్బులు కాలిపోయి.. పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగినా ఇప్పటివరకు అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వానికి పేద లంటే చిన్న చూపా అని ప్రశ్నించారు. దగ్ధమైన గుడిసె వాస ులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని.. వాళ్లకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ప్రజలను ఆదుకోకపోతే భవిష్యత్తులో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు మల్లేశం, రాజు గుడిసె వాసులు పాల్గొన్నారు.

'ఐద్వా' ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

నవతెలంగాణ-అమీన్‌పూర్



ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో బీరంగూడ భ్రమరాంబిక నగర్ కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ డాక్టర్ సరళ కుమారి హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ మహిళల సంఖ్య ఇంకా ఎంతో పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగం చేయాలంటే కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో అవసరమన్నారు. ప్రధానంగా అమ్మాయిలు చదువుకుంటే ఆ కుటుంబానికి వెలుగునిస్తుందన్నారు. అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యురాలు, ఐద్వా రాష్ట్ర నాయకురాలు నాయిని లలిత మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా మహిళలందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఆ సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వాలు పనిచేయాలన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై మహిళా సంఘం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించి మహిళా హక్కులపై నిరంతరం పోరాడుతున్నామన్నారు. మహిళా సాధికారంగా దిశగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించడం కాకుండా మహిళల అభివృద్ధి కోసం ఆర్థిక పరిస్థితి మెరుగు కోసం, ప్రధానంగా విద్య, వైద్యం మహిళలకు అందే విధంగా చూడాలని ప్రభుత్వాలను కోరారు. ఈ సదస్సులో బీరంగూడ ఐద్వా సంఘం మహిళా నాయకురాలు, వివిధ కాలనీల మహిళలు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్ రద్దు చేసే వరకు పోరాటం ఆగదు

నవతెలంగాణ-గుమ్మడిదల : మండలంలోని నల్లవల్లి ప్యారానగర్‌లో ఏర్పాటు చేయనున్న డంపింగ్‌యార్డ్‌ను రద్దు చేసే వరకు తమ పోరా టం ఆగదని కొత్తపల్లి, నల్లవల్లి, ప్యారానగర్, గుమ్మడిదల గ్రామాల ప్రజలు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నిరవధిక రిలే నిరాహార నిరసనలు చేపడుతు న్నారు. అందులో భాగంగా ఆదివారం 33వ రోజు నిరవధిక నిరసన తెలిపారు. 33 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నా ప్రభుత్వ అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు తీవ్రంగా నష్టం కలిగించే ఈ డంపింగ్ యార్డ్‌ను వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. డంపింగ్‌యార్డ్ వల్ల పర్యావరణ కాలుష్యం జరిగి, ఆరోగ్య సమస్యలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవ సాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులం తీవ్రంగా నష్టపోతామని.. వెంటనే డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని కోరారు. డంపింగ్ యార్డు రద్దు చేసే వరకూ పోరాటం ఆగదని హెచ్చరించారు.



మహిళా దినోత్సవం స్ఫూర్తితో మహిళ హక్కులకై పోరాడుదాం

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ

26

నవతెలంగాణ-సిద్ధిపేట

20వ శతాబ్దం ప్రారంభంలో క్రూరమైన దోపిడీ,అమానవీయ పని పరిస్థితులకు సామ్రాజ్యవాద యుద్ధాలకు వ్యతిరేకంగా, తమకూ ఓటు హక్కు కావాలనే డిమాండుతో మహిళా కార్మికులు చేసిన పోరాటాల ఫలితంగా ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఈ స్ఫూర్తితోనే మహిళా హక్కులకై పోరాడుదామని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ అన్నారు. సిద్దిపేటలో కార్మిక కర్షక భవనంలో జరిగిన అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, జర్మన్ విప్లవకారిణి, సోషలిస్ట్ నాయకురాలు క్లారా జెట్కిన్ ప్రతిపాదన ప్రకారం ఆగస్టు 1910లో డెన్మార్క్‌ని కోపెన్హాగన్లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్ట్ ఉమెన్స్ కాన్ఫరెన్స్లో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరపాలని నిర్ణయమైందన్నారు. 1975లో ఐక్యరాజ్యసమితి దీనిని అధికారికంగా గుర్తించటంతో, అప్పటి నుండి భారతదేశంతో సహా ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రారంభమైందన్నారు. మహిళలకు సమానత్వం, న్యాయం, దోపిడీ, వివక్ష, హింస లేని జీవితం లక్ష్యంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం యొక్క సోషలిస్ట్ వర్గ దృక్పథాన్ని మరుగునపరచి, వ్యాపార సంస్కృతి పెరుగుతోందన్నారు. ప్రస్తుతం భారతదేశంలో మహిళలు చాలా దారుణమైన పరిస్థితుల మధ్య మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు, ముఖ్యంగా శ్రామిక మహిళల హక్కులపై వివక్ష , దాడులు విపరీతంగా పెరిగాయని, దేశంలో దాదాపు డెబ్బై శాతం మంది మహిళలు నిరుద్యోగులు, ప్రమాదకరమైన స్వభావం కలిగిన పనుల్లో ఎక్కువగా పని చేస్తున్నారన్నారు. ఎటువంటి వేతనాలు చెల్లించని పనులలో మహిళల వాటా పెరుగుతోందని, అంగన్వాడి, అశా, మధ్యాహ్న బోజనం, జాతీయ ఆరోగ్య మిషన్, ఐకెపి, పట్టణ ఆర్పీ లు మొదలైన కేంద్ర పథకాలలో పనిచేసే కార్మికులలో అత్యధికులు మహిళలేనని, వీరిని బిజెపి ప్రభుత్వం కార్మికులుగా గుర్తించట్లేదని, కనీస వేతనాలు అమలు చెయ్యట్లేదని, గౌరవ వేతనం, పారితోషికాల పేరుతో శ్రమ దోపిడీ చేస్తోందన్నారు. ముఖ్యంగా మహిళా కార్మికులకు చట్టపరమైన హక్కులపై సుప్రీంకోర్టు ఉత్తర్వులను కూడా అమలు చేయలేదన్నారు. భారతీయ మహిళల్లో 45 శాతం మంది పిల్లల, వృద్ధుల సంరక్షణ కారణంగా ఎటువంటి జీతభత్యం లేని పనుల్లో ఉంటున్నారన్నారు. ప్రభుత్వాలు మహిళల ఆరోగ్యాన్ని పట్టించుకోకపోవడం వల్ల, మహిళల ఆరోగ్య పరిస్థితి దినదినం దిగజారుతుందన్నారు. పురుషులతో సమానంగా పనిచేస్తున్న 40 శాతం తక్కువ వేతనాలు అందుకుంటున్నారన్నారు, పని ప్రదేశాలలో రక్షణ లేదన్నారు.

అసంఘటితరంగ కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉన్నదని, మహిళా, ఉద్యోగుల పిల్లలకు పాలు ఇచ్చేందుకు కూడా సమయమివ్వరన్నారు. మహిళా కార్మికులకు లేదా బాలికలకు (విద్యార్థినులు) రుతుక్రమ సమయంలో సెలవులు ఇవ్వాలనే నిబంధన లేదని, సుదీర్ఘమైన పని గంటలు, కష్టతరమైన టార్గెట్ల మూలంగా ఆరోగ్యం మీద తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయన్నారు. దేశంలో మహిళలు, పిల్లలపై హింస ఆందోళన కలిగించే స్థాయిలో ఉందని, సగటున ప్రతి 15 నిమిషాలకు ఒక అత్యాచారం నమోదవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో 15 శాతం మైనర్లు ఉన్నారన్నారు. పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పిఓఎస్‌హెచ్) 2013లో ఆమోదించినప్పటికీ, ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థలలో కూడా అంతర్గత ఫిర్యాదు కమిటీలు అన్నిచోట్ల ఏర్పడలేదన్నారు. 2023లో పని ప్రదేశాలలో లైంగిక వేధింపులలో 31 శాతం గణనీయంగా పెరిగాయని, గ్రామీణ ప్రాంతాల్లో, వ్యవసాయ క్షేత్రాలలో పనిచేసే మహిళలు కూడా లైంగిక వేధింపులు, హింసను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, కోశాధికారి భాస్కర్, సహాయ కార్యదర్శి తునికి మహేష్, సభద్ర, మనోహరి, కల్పన, సుధారాణి, లక్ష్మి, సంధ్యారాని, మమత, కృష్ణవేణి, పావని, ఫాతిమా, వరకుమారి, రజని తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
సోమవారం | 10 మార్చి 2025 | www.navatelangana.com

వైభవంగా శ్రీ లక్ష్మీ అనంత పద్మ స్వామి కల్యాణోత్సవం

ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే

నవతెలంగాణ-రామచంద్రాపురం



తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెలలో శనివారం రాత్రి నిర్వహించిన శ్రీ లక్ష్మీ అనంత పద్మ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, కళ్యాణ మహోత్సవం వేలాది మంది భక్తుల సమక్షంలో వేద మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా జరిగాయి. పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ప్రముఖ ఆలయంగా విరజిల్లుతున్న అనంత పద్మనాభ స్వామి ఆలయం మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మెన్ ప్రభాకర్, అమీన్పూర్ మాజీ జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ విజయ్ కుమార్, వెంకట్ రెడ్డి, దశరథ్‌రెడ్డి, మల్లా రెడ్డి, రవీందర్ రెడ్డి, కొమరయ్య, స్థానిక సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండలంలోని రేజింతల్ గ్రామ పంచాయతీలో గల తాగునీటి ఎద్దడిపై 'మండుతున్న ఎండలు.. తాగునీటి కష్టాలు' అనే శీర్షికన నవతెలంగాణ దినపత్రికలో ఇటీవలే ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఎంపీడీఓ రాజశేఖర్, ఎంపీఓ సౌజన్యలు రేజింతల్‌లో గ్రామసభ నిర్వహించి తాగునీటిపై ప్రజలతో చర్చించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. దెబ్బతిన్న బోర్ మోటార్లకు మరమ్మతులు చేయించారు. కాగా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన నవతెలంగాణకు ప్రజలు ధన్యవాదాలు తెలిపి.. సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ అరుణ జ్యోతి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి , సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి , మైముద్ అలీ, తిరుపతి రెడ్డి, మోషప్ప తదితరులున్నారు.

నవతెలంగాణ స్పందన

లోక్ అదాలత్‌లో 44 కేసులు పరిష్కారం

నవతెలంగాణ-వట్‌పల్లి

జోగిపేట మున్సిఫ్ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో వట్‌పల్లి మండలానికి సంబంధించి వివిధ రకాలైన 44 కేసులను మెజిస్ట్రేట్ ధనలక్ష్మి పరిష్కరించినట్టుఎస్సై విట్టల్ తెలిపారు. 2023 నుండి పెండింగ్‌లో ఉన్న 47 పిటి పరిష్కరించి ఒక్కొక్క వ్యక్తికి రూ.10 జరిమానా విధించారు. రాజీ మార్గమే రాజమార్గంగా భావించాలని.. పంతాలకు పోయి సమస్యను జటిలం చేసుకంటూ కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దని మెజిస్ట్రేట్ ధనలక్ష్మి సూచించారు. దుద్యాల గ్రామానికి చెందిన, టీపీసీ పోతుల గూడ గ్రామానికి చెందిన తండ్రి కొడుకులకు సంబంధించిన ఒక కేసును కూడా పరిష్కరించారు. రాజీమార్గంతో కేసుల పరిష్కారానికి కృషిచేసిన వట్‌పల్లి ఎస్సై విట్టలను, పోలీస్ సిబ్బందిని మెజిస్ట్రేట్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కోర్టు మూన్సి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



వివాహా వేడుకల్లో పాల్గొన్న నరోత్తం

నవతెలంగాణ-జహీరాబాద్

ఈదులపల్లి గ్రామానికి చెందిన మల్కాపురం శరణయ్య మనవరాలు, సంఘమేశ్వర్ కుమార్తె వివాహం ఝరాసంఘం మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్‌తో కలిసి హాజరై.. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహా వేడుకల్లో మాజీ సర్పంచ్‌లు శంకర్, శేఖర్‌పాటిల్, జి.నర్సింలు, శేఖర్, నాగన్న పాటిల్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-జహీరాబాద్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే అందరి లక్ష్యం అని ఆర్టీసీ డీఎం జాకీర్ హుస్సేన్ అన్నారు. శనివారం సాయంత్రం డిపోలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందు న్నారని ఎంతో అభివృద్ధి చెందుతున్నారన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా కొంతమంది సీనియర్ మహిళలను శాలువాలతో సన్మానించారు. మహిళామణులు ఆటాపాటలతో ఆనందంగా ఈ మహిళా దినోత్సవాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, గ్యారేజ్ ఇంచార్జ్ తిరుమలేష్, డిపో మహిళా ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు రాయితీ అవకాశం

నవతెలంగాణ-న్యాల్‌కల్

ఎల్‌ఆర్‌ఎస్‌పై 25శాతం రాయితీ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని ఎంపీడీఓ రాజశేఖర్ తెలిపారు. ఈనెల 31 వరకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందన్నారు.కాబట్టిదరఖాస్తుదారులుఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఎమ్మెల్సీగా విజయం సాధించిన శ్రీపాల్‌రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-జోగిపేట

వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులుగా విజయం సాధించిన పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డిని పీఆర్టీయూ టీఎస్ జిల్లా శాఖ పక్షాన జిల్లా అధ్యక్షులు ఆకుల మానయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల ప్రభుల ఆధ్వర్యంలో శాలువా పూలమాల, పూలబొకేతో ఘనంగా సన్మానిం చారు. హైదరాబాద్ నారాయణగూడలోని పీఆర్టీయూ టీఎస్ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర శాఖ ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో భాగంగా జిల్లా శాఖ తరపున అక్కడికి వెళ్లి సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్, టీ బేస్ రాష్ట్ర అధ్యక్షులు పీపీ రాథోడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మన్మథ కిషోర్, కే దేవి సింగ్, కిఫాయత్ అలీ, గుమ్మడిదల మండల శాఖ అధ్యక్షుడు విజయ్‌కుమార్, రాష్ట్ర బాధ్యులు నాగభూషణం, అప్పి రెడ్డిలు పాల్గొన్నారు.



ఘనంగా కట్ట మైసమ్మ తల్లి జాతర

నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండల గడ్డపోతారం మున్సిపాల్టీ పరిధిలో నిర్వహించిన కట్ట మైసమ్మ, ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవాల కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నేత, సిజిఆర్ ట్రస్ట్ చైర్మెన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట యువకిశోరం జిన్నారం వెంకటేష్ గౌడ్, గుమ్మడిదల మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జాతర ఉత్సవాల నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ జాతరోత్సవాల్లో గడ్డపోతారం, అలీనగర్, చెట్లపోతారం, కిష్టయ్యపల్లి తదితర గ్రామాలతో పాటు సమీప గ్రామాల ప్రజలు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలోనాయకులు వెంకటేష్ , శివరాజ్ జనార్ధన్, ప్రభాకర్‌రెడ్డి, రాజేష్, ఆది రామకృష్ణ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

నేటి సమాజంలో గురువులకు దక్కని గౌరవం





- సామాజిక మాధ్యమాల ప్రభావంతో తరగతి గదుల్లోనూ విద్యార్థుల అల్లరి చేష్టలు
- ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులు..

నవతెలంగాణ-మునిపల్లి

ప్రతీ విద్యార్థికి క్రమశిక్షణ ముఖ్యం. విద్యార్థి ముందుగా నేర్చుకోవాల్సింది క్రమశిక్షణ, తర్వాత విద్య, జ్ఞానం. ఒకవేళ విద్యార్థికి క్రమశిక్షణ లేకపోతే విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడం సాధ్యం కాదు. ఎంత నిష్ణాతులు బోధించి నప్పటికీ క్రమశిక్షణ కొరవడితే తరగతి గదిలో అందరికీ నష్టం వాటిల్లుతుంది. ఒక తరగతి గదిలో ఇద్దరు ముగ్గురు విద్యార్థులు క్రమశిక్షణ తప్పితే ఆ ప్రభావం మొత్తం తరగ తిపై ఉంటుంది. పాఠశాల మొత్తాన్ని ప్రభావితం చేస్తుంది.. ఈ మధ్యకాలంలో ఉన్నత పాఠశాలకు చెందిన బాలురు ఇళ్ల వద్ద విరివిగా మొబైల్ ఫోన్‌లను వాడడం సామాజిక మాధ్య మాల్లో చురుకుగా ఉండడంతో క్రమశిక్షణ కొరవడింది. అది తరగతి గది వాతావరణాన్ని తీవ్ర అభ్యంత రకర రీతిలో తీసుకెళ్తున్నది. దాంతో తరగతిలోకి వెళ్లాలంటేనే ఉపాధ్యా యులు భయపడే స్థితికి చేరుకున్నది. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు పరిమిత స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా కొంత కట్టడి చేస్తున్నప్పటికీ ఉన్నత పాఠశాలలో మాత్రం విద్యార్థులను కట్టడి చేయలేకపో తున్నామని.. వారికి విద్యాబోధన తలకు మించిన భారమైందని ఉపాధ్యాయులు పలువురు వాపోతున్నారు.

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలో ఒక ఆదర్శ పాఠశాల, ఒక ఉర్దూ మీడి యం ఉన్నత పాఠశాల, 11 తెలుగు మరియు ఆంగ్ల మాధ్యమ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

ఇక మండలంలోని ఒక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత రెండు నెలల క్రితం పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రమశిక్షణారహిత్యంగా ప్రవర్తించడంతో అక్కడ కొన్ని రోజులు ఉపాధ్యాయులు తరగతిలో గదిలోకి వెళ్లకుండా పాఠ్యాంశాలు బోధించకుండా సహాయ నిరాకరణను పాటించారు. విద్యార్థుల్లో మంచి పరివర్తన తీసుకొచ్చేందుకు స్థానిక ప్రధానోపాధ్యాయురాలు ఎంతో కష్టపడుతున్నప్పటికీ విద్యార్థుల నుంచి కొంత అవరోధత ఏర్పడుతునట్టు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఆ పాఠశాలలో మూత్ర విసర్జన పేరిట బయటకు వెళ్లిన విద్యార్థులు ఒక ప్రార్థనా మందిరం వద్ద పుట్టినరోజు వేడుక జరుపుకొని కేకు కోసుకొని కేరింతలతో ఇబ్బందికరమైన వాతావరణాన్ని సృష్టించారు. అంతేకాకుం డా ఆ ప్రార్థన మందిరం వద్ద కేకు, చాక్లెట్లు పడవేయడంతో సదరు ప్రార్థన మందిర నిర్వాహకులు విద్యార్థుల వికృత చర్యలను ప్రధానోపా ధ్యాయురాలు దృష్టికి తీసుకువచ్చారు. దాంతో ఆమె తీవ్రంగా ఆవేదన చెందినట్లు తెలిసింది. ఇదే పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు పాఠ్యాంశం బోధిస్తుండగా నీళ్లు తాగే నెపంతో టేబుల్‌పై ఉమ్మి వేసి సదరు ఉపాధ్యాయుడిని క్షమించమని కోరినట్టు తెలిసింది. దాంతో మనస్థాపం చెందిన ఉపాధ్యాయుడు రెండు రోజులు సెలవుపై వెళ్ళి నట్టు తెలిసింది. ఇక లాభం లేదని ఉపాధ్యాయులతో చర్చించి తరగతి గదిలోకి ఉపాధ్యాయులు వెళ్లకుండా, పాఠ్యాంశాలు బోధించకుండా సహాయ నిరాకరణ చేపట్టినట్టు తెలియవచ్చింది. దాంతో ఆ విషయం కొంత బాగా చదువుకునే విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియడంతో విద్యార్థులలో తప్పు చేసామనే భావన, పశ్చాత్తాపం వంటి మార్పు వస్తుందని ఉద్దేశంతో అలా చేశామని సదరు ప్రధాన ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించినట్టు తెలిసింది. ఆయా పాఠశాలలో కొరవడుతున్న క్రమశిక్షణతో దశాబ్దకాలం పాటు విద్యా బోధన చేసిన ప్రధానోపాధ్యాయులు సైతం విద్యార్థులను కట్టడి చేయలేకపోతున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మింగలేక కక్కలేక అన్నట్టుగా విద్యార్థులకు చెప్పలేక తల్లిదండ్రులకు వివరించలేక అయిష్టంతో పాఠశాల వ్యవస్థను నెట్టుకొస్తున్నారు.

మండలంలోని ఒక తెలుగు మాధ్యమం ఉన్నత పాఠశాలలో మొత్తం 50 మంది లోపు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. అయితే అక్కడ గరిష్టంగా ఉన్న ఒక తరగతిలో విద్యార్థులు ఉపాధ్యా యులు చెప్పినది వినకుండా క్రమశిక్షణారాహితంగా ప్రవర్తించడం, పాఠ్యాంశాలను శ్రద్ధగా వినకపోవడం, ఉపాధ్యాయులకు ఎదురు చెప్పడం తదితర పనులకు పాల్పడుతుండడంతో కొన్ని రోజులుగా తరగతి గదికి వెళ్లి పాఠ్యాంశాలు చెప్పడం మానేసినట్టు తెలిసింది. ఇకనైనా తాము తప్పు చేశామని భావన విద్యార్థుల్లో కలుగుతుందే మోనని ఎదురు చూస్తున్నామని పేరు చెప్పడానికి ఇష్టం లేని ఉపాధ్యాయుడు చెప్పుకు వచ్చారు. విద్యార్థులకు హెయిర్ స్టైల్ విషయంలో కూడా మార్పు తెచ్చి ఆదర్శనీయమైన భావాలు నేర్పేందుకు ఒక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయురాలు ఎంత ప్రయత్నించిన ప్పటికీ అమలు సాధ్యం కాలేదు. క్రమేపి ఉన్నత పాఠశాలల్లో అనుకూల వాతావరణం కనుమరుగవుతుండడ ంతో బాలికల సంఖ్య తగ్గుతోంది. ప్రాథమిక విద్య అయిపోగానే ఆరో తరగతిలో కస్తూర్బా గాంధీ విద్యాల యాలు, గురుకులాలు ఇతర ప్రైవేటు పాఠశాలకు పంపుతున్నారు.

మండలంలోని మారుమూల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదేండ్ల క్రితం 300 పై చిలుకు విద్యార్థుల సంఖ్య ఉండేది. అందులో 50శాతం పైగా అమ్మాయిలే ఉండేవారు. మండలం లోని కొన్ని పాఠశాలల్లో అక్కడక్కడ అనుకోని సంఘటనలు జరుగుతు ండ డంతో ప్రస్తుతం ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య వందకు చేరింది. అటు ఉపాధ్యాయులు ఇటు విద్యార్థులతో కళ కళలాడిన పాఠశాల ప్రస్తుతం విద్యార్థులు లేక వెలవెలబోతున్నది. నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నప్పటికి ఆశించిన మేర విద్యార్థులు లేకపోవడం తో చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు అయిష్టంగానే పనిచేస్తున్నారు.

విద్యాహక్కు చట్టం, బాలల హక్కుల చట్టం వంటి అనేక అంశాలు ఉపాధ్యాయుల ఆదర్శభావాలను కట్టడి చేస్తున్నాయని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు. విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి వెళ్ళగానే తల్లిదండ్రుల మొబైల్ ఫోన్లను తీసుకుని గుంపులు గుంపులుగా సంచరిస్తూ వాట్సాప్, ఫేస్బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ఎన్నో సామాజిక మాధ్యమాల వలలో చిక్కుకుంటున్నారు. దానికి తోడు ఆన్లైన్ గేమ్లు ఆడడంతో వారికి సమయమే తెలియడం లేదు. దీన్ని కట్టడి చేయాల్సిన విద్యార్థుల తల్లిదండ్రులు కిక్కురు మనడం లేదు. తమ పిల్లలు చదవడం లేదని ఉపాధ్యాయులపై భారం మోపుతున్నారు. ఇకనైనా ఆయా పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి వాస్తవాలను వివరించి విద్యార్థుల్లో మంచి పరివర్తన దిశగా అడుగులు వేస్తే విద్యా ప్రమాణాలు పెంపొంది ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించే అవకాశం ఉంది.

కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటాం

నవతెలంగాణ-జహీరాబాద్



పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి.. అన్ని విధాల సేవలు అందించడమే తమ లక్ష్యం అని సెట్విన్ చైర్మెన్ గిరిధర్ రెడ్డి, టీఎస్ఐడీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్, డాక్టర్ ఉజ్వల్ రెడ్డిలు అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఎస్వీ కళ్యాణ మండపంలో నాయకులు భాస్కర్‌రెడ్డి దంపతుల 25వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భాస్కర్ రెడ్డి దంపతులు పార్టీ సంక్షేమం కోసం ఎల్లవేళలా కృషి చేశారని..న్యాల్కల్ మండలంలో పార్టీ అభివృద్ధికి వారు చేసిన సేవలు ఎనలేనివన్నారు. భాస్కర్ రెడ్డి దంపతులు సర్పంచ్ స్థాయి నుంచి జెడ్పీటీసీ వరకు ఎదిగారన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా వివిధ రకాల సేవలు అందించి అందరి మన్న నలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మం డల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంత్ రావు పాటిల్, పి. నర్సింహారెడ్డి, రామలింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, మహంకాల్ సుభా ష్ గుప్తా, అరుణ్ కుమార్, నాగిరెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, మహవ బ్బద్ ముబీన్, నరసింహారెడ్డి,జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమానత్వం మన ఇంటి నుంచే ప్రారంభమవ్వాలి

నవతెలంగాణ-అమీన్‌పూర్



మహిళల సమానత్వం అనేది మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని.. ఇంట్లో మగ, ఆడ పిల్లలను సమానంగా చూడాలని అమీన్పూర్ ఎస్సై సోమేశ్వరి అన్నారు. అమీన్పూర్ మున్సిపాల్టీ పరిధిలోని మల్లికార్జున హిల్స్ కాలనీలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథు లుగా పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సతీమణి యాదమ్మ అమీన్పూర్ ఎస్సై సోమేశ్వరి, డాక్టర్ దీప్తి, అడ్వకేట్ నీరజతో పాటు నందారం లలిత, నందారం ఉమారాణితోపాటు పలువురు ముఖ్య అతిథులుగా హాజర య్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు కలిగి ఉండాలని విద్య ఉపాధి రాజకీయ రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలని కోరారు. ప్రధానంగా అమ్మాయిలు బాగా చదువుకోవడంతో ఆ కుటుంబానికి వెలుగును ఇస్తుందన్నారు. మగ పిల్లలను ఆడ పిల్లలు సమానంగా పెంచాలన్నారు. బాల్యం నుంచే ఇంట్లో సమానత్వం పెంపొందించాలని.. మగ పిల్లలకు మహిళలను గౌరవించే విధంగా విలువలు నేర్పాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మహిళలందరూ ఎంతో కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవడం సంతోషకరంగా ఉన్నదన్నారు. నేడు మహిళలు వారి కాళ్ళ మీద వాళ్లు నిలబడి ఒకవైపు కుటుంబ పోషణ పోషిస్తూ మరోవైపు సమాజంలో తమ బాధ్యతను నడిపిస్తూ ముందుకు వెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

నవతెలంగాణ-న్యాల్‌కల్



పదోతరగతిలో మండల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ.. శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నారు. మండల పరిధిలోని మిర్జాపూర్ (బి), మెటల్‌కుంట, హద్నూర్, రేజింతల్ తదితర ప్రభుత్వ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలల్లో 414 మంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వార్షిక పరీక్షల్లో 100శాతం ఫలితాలు సాధించేలా ఉదయం, సాయంత్రం అదనంగా ఓ గంటపాటు నిత్యం ప్రత్యేక బోధన చేస్తున్నారు. విద్యార్థులను గ్రూపులుగా విభజించి క్లుప్తంగా బోధిస్తున్నారు. రాగా ప్రత్యేక తరగతుల్లో విద్యార్థుల కోసం స్నాక్స్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. ఒక్కో విద్యార్థిపై రూ.15 చొప్పున ఖర్చు చేస్తుంది.కాగా మార్చి 21 వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

తల్లిదండ్రులు కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలి



మిర్జాపూర్(బి) ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేకంగా సన్నద్ధం చేస్తున్నాం. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు సైతం శ్రద్ధ చూపాలి. విద్యార్థులు ఫోన్లకు దూరంగా ఉండాలి.

-రాజ్ కుమార్, హెచ్ఎం

మంచి మార్కులు సాధిస్తాం



ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇవి మాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. సెలబస్ సులభంగా అర్థమయ్యే రీతిలో గ్రూప్‌లుగా విభజించి టీచర్లు వివరిస్తున్నారు. మేము కూడా మంచిగా చదువుకుంటున్నాం. మంచి మార్కులు సాధిస్తాం.

-అఖిల, విద్యార్థిని

లయన్స్ క్లబ్ జిల్లా నూతన గవర్నర్, పీఆర్‌ఓలకు శుభాకాంక్షలు

నవతెలంగాణ-జోగిపేట



2025-26 సంవత్సరానికి గాను లయన్స్ క్లబ్ జిల్లా నూతన గవర్నర్‌గా ఏ.అమర్నాథ్‌రావు, జిల్లా పిఆర్‌ఓగా డాక్టర్ కె.అనంతరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దాంతో వారికి జోగిపేట లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శులు ఎం పద్మనాభరెడ్డి, ఎస్.జగన్ మోహన్ రెడ్డి, ఆకుల రాంబాబు, జోన్ చైర్మెన్ తోట్ల రామకృష్ణ, క్లబ్బు అధ్యక్షులు అల్లే శ్రీకాంత్, కోశాధికారి గడ్డమీది సంతోష్ లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.. ఆదివారం షామీర్‌పేట్‌లోని రాగి కన్వెన్షన్ హాలులో నిర్వహించిన 19వ డిస్ట్రిక్ట్ కన్వెన్షన్ కార్యక్రమంలో వారిని కలిసి శుభాకాంక్షలు చెప్పారు. రాబోవు సంవత్సరంలో లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తరింప చేయాలని వారు సూచించినట్లు తెలిపారు.

విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న చంద్రారెడ్డి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



ఆర్సీపురం కార్పొరేటర్ పుష్ప నాగేష్ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించబడిన రామాలయం, శివాలయం, సరస్వతి దేవి ఆలయంతో పాటు జంట నాగులు, ధ్వజస్తంభాల ప్రతిష్టాపన మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ క్రతువులో బొల్లారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న నాయకులను కార్పొరేటర్ దంపతులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నగేష్ యాదవ్, బొల్లారం మున్సిపల్ నాయకులు సంపత్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి మల్లేశం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి ఇష్టంగా చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

నవతెలంగాణ-జహీరాబాద్

కష్టపడి ఇష్టంగా చదువుకునే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓ బస్వరాజ్ అన్నారు. స్థానిక మాణిక్ ప్రభు పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వీడ్కోలు అనేది ప్రతి విద్యార్థి జీవితంలో ఉంటుందన్నారు. ఇక్కడినుంచి ఒక అధ్యాయం నుంచి నూతన అధ్యాయం వైపు ప్రయాణం సాగుతు ందన్నారు. ఈ ప్రయాణంలో విద్యార్థులు తమ లక్ష్యాల వైపు అడుగులేస్తూ గమ్యాలకు చేరుకోవాలన్నారు. పదో తరగతి రాసున్న విద్యార్థులు మంచి లక్ష్యంతో అలాగే ఎటువంటి భయం లేకుండా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. పద్మశాలీ సంఘం అధ్యక్షులు జనార్ధన్ మాట్లా డుతూ.. శ్రీ మాణిక్ ప్రభు ఉన్నత పాఠశాల 40ఏండ్ల నుంచి పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. ఈ సంవత్సరం కూడా శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు.ఈ కార్యక్రమానికి పాఠశాల అధ్యక్షులు ఎంపల్లి మల్లికార్జున్, పాఠశాల కార్యదర్శి కొత్తకాపు సుభాష్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ ఎంవెంకటయ్య హాజరయ్యారు. విద్యార్థులు చేసిన కార్యక్రమాలు ఎంతోగానో ఆకట్టుకు న్నాయి. అలాగే ఎంఈఓ బసవరాజ్.. విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులను విద్యార్థులకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, నాగలక్ష్మి ,శివశం కర్, రాజేష్, సికిందర్, లక్ష్మి, స్వరూప, సుధా,మధు పాల్గొన్నారు.



'ఎల్‌ఆర్‌ఎస్ పై అప్పుడొక మాట.. ఇప్పుడొక మాట'

నవతెలంగాణ-జహీరాబాద్



ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్‌ఆంఎస్ సౌకర్యం ఉచితంగా కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. నేడు అధికారంలోకి రాగానే వివిధ రకాల స్కీములు పెట్టడం ఎంతవరకు సమంజసమని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నామ రవి కిరణ్ గుప్తా విమర్శించారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడు తూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత ఎల్ఆర్ఎస్ అని ప్రకటించి, ఇప్పుడు ఎల్ఆర్ఎస్ ఫీజు కట్టాలని ప్రభుత్వం ఎందుకు చెబుతోందని ప్రశ్నించారు. మార్చి 31లోపు చెల్లిస్తే 25శాతం రిబేట్ ఇస్తామనడం జనాలను మోసం చేయడమే అన్నారు. కాంగ్రెస్ పాలన అర్థంగాక ప్రజలు అయోమయంలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ప్రతి పక్షంలో ఒకమాట, అధికారంలో ఒకమాట మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేసేంతవరకు ప్రజలెవరు డబ్బులు చెల్లించొద్దన్నారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేసేంతవరకు ప్రజలకు మద్దతుగా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. ఆరు హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందన్నారు. ప్రజల వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో మాజీ పట్టణ పార్టీ అధ్యక్షుడు మహ మ్మద్ యాకూబ్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బండి మోహన్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివప్ప, అప్పి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
సోమవారం | 10 మార్చి 2025 | www.navatelangana.com

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ సాబేర్ అలీ, శ్రీనివాస రాథోడ్ కోరారు. స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ సంగారెడ్డి జిల్లా శాఖ ప్రథమ కార్యవర్గ సమావేశాన్ని స్థానిక ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబేర్ అలీ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా సబర్ అలీ, శ్రీనివాస్ రాథోడ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమ స్యల పరిష్కారమే ఎస్టీయూ ధ్యేయమని.. 78 ఏండ్లుగా ఉపాధ్యాయుల పక్షపాతిగా సంఘం కొనసాగు తుంద న్నారు. సంవత్సరాల తరబడి వివిధ రకాల ఆర్థికపరమైన బిల్లులను పెండింగ్‌లో ఉంచి ఆర్థిక మనోవేదన గురి చేస్తున్నారని.. వెంటనే వాటిని రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదు డీఏలు పెండింగ్‌లో పెట్టారని వాపోయారు. పెరిగిన ధరల కనుగుణంగా రావా ల్సిన డియర్‌నెస్ అలవెన్స్‌ను పట్టించుకోకపోవడం బాధా కరమన్నారు. వెంటనే పెండింగ్ డీఏలను రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ పీఆర్సీ కాలం కూడా పూర్తి అయి దాదాపు 22 నెలలు కావస్తున్నందునా.. వెంటనే పీఆర్సి నివేదిక తెప్పించుకుని అమలు చేయాలని కోరారు. సమావే శంలో పలు తీర్మానాలు ఆమోదించుకున్నట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణకుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ప్రతాపరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జీవన్ రాథోడ్, అధ్యక్షులు ఖయ్యూం, సంగారెడ్డి మండలాధ్యక్షులు అంజద్‌అలీ, పటాన్చెరు మండలాధ్యక్షులు సుందర్రావు, రామచంద్రపురం మండలాధ్యక్షులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకులో దోపిడీకి దుండగుల యత్నం

నవతెలంగాణ-శివ్వంపేట



మూసి ఉన్న బ్యాంకులో దోపిడీకి గుర్తు తెలియని వ్యక్తులు నగదు దోపిడీకి యత్నించిన ఘటన మండలంలోని దొంతి గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 7న దొంతి యూనియన్ బ్యాంకు విధులు ముగించుకొని వెళ్లిన బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ కునాల్ గౌతమ్‌కు అదే రాత్రి బ్యాంకు బిల్డింగ్ యాజమాని కర్రె మోహన్ ఫోన్ చేసి ఒంటి గంట అందజకు బ్యాంకులో ఎదో శబ్దం వినిపించిందని ఫోన్ చేయగా వెంటనే అక్కడికి వచ్చి చూడగా బ్యాంకు గది ముందు భాగం కిటికీ ధ్వంసం అయి ఉందని, బ్యాంకులో డబ్బులను దొంగిలించేందుకు దొంగలు యత్నించారని బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ గౌతమ్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. బ్యాంకులో చోరికి యత్నించిన నిందితులను సీసీ పుటేజీల ద్వారా గుర్తించి, బాధ్యులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపారు.

ఉసిరికపల్లి ఘటనలో కేసు నమోదు

భూముల గోదావల విషయంలో నివాసముంటున్న ఇల్లు తగులబెట్టారని బాధితులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఉసిరికపల్లి శంకర్ తాండకు చెందిన కేతావత్ రాజు కుటుంబానికి భూముల విషయంలో గొడవలు జరుగగా హైదరాబాద్‌కు చెందిన రమేష్ రెడ్డి రాజుకు ఈ నెల 7న ఫోన్ చేసి భూముల విషయం మాట్లాడుతుకుందామని మేడ్చల్ రమ్మని తన కారును పంపించగా బాధిత కుటుంబసభ్యులు అదే కారులో మేడ్చల్ బయలుదేరి ఎళ్లారు. మధ్యాహ్నం పక్కింటి వాళ్లు ఫోన్ చేసి మీ ఇంటిని ఎవరో తగుల బెట్టారని, ఫోన్ చేయగా వెళ్లి చూడగా ఇల్లు పూర్తిగా కాలిపోయి ఉందని తెలిపారు. ఇల్లు తగులబెట్టినట్లుగా ఉసిరికపల్లి గ్రామానికి చెందిన తూము కృష్ణారావుపై అనుమానం ఉందని బాధితురాలు కేతవత్ మమత ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏడుపాయలలో భక్తుల సందడి

పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తగనం



నవతెలంగాణ-పాపన్నపేట

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల దుర్గామాత వద్ద భక్తుల సందడి కొనసాగింది. భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారు తల్లిగా విరాజిల్లు తున్న ఏడుపాయల వన దుర్గ భవాని మాత ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరా నదిలోని పాయల్లో చెక్ డ్యాం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఓడి బియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు ,బోనాలు, సమర్పించి మొక్కుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏడుపాయల ఈవో చంద్రశేఖర్, రవి కుమార్, సూర్య శ్రీనివాస్, ప్రతాపరెడ్డి, నర్సింలు, బ్రాహ్మాచారి, భత్తిని రాజు తదితరులు ఏర్పాటు చేశారు, వేద పండితులు శంకర శర్మ పార్థివ శర్మ మురళీధర్, రాజశేఖర్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించగా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తగిన బందోబస్తు చర్యలు చేపట్టారు.

వంట చేస్తున్న క్రమంలో గ్యాస్ లీకై అగ్నిప్రమాదం



నవతెలంగాణ-నార్సింగి

వంట గ్యాస్ లీకై అగ్నిప్రమాదం జరిగిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నార్సింగి పట్టణ కేంద్రానికి చెందిన మైలారం సిద్ధిరాములు ఇంట్లో ఆడవారు ఆదివారం ఉదయం వంట చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. మంటలు అంటుకున్న విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న స్థానిక ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దగ్గరలో ఉన్న నీళ్ళ ట్యాంకర్ సహాయంతో మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తూ ఇంట్లో ఉండిపోయిన సిద్ధిరాములు తల్లి, భార్యను బయటకు తీసుకు వచ్చారు. అనంతరం ప్రమాద స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను పూర్తిగా ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంలో ఇద్దరికీ స్వల్ప గాయాలు కాగా వారికి స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదంలో అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, దాదాపు రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ తెలిపారు.





చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

- మహిళల హక్కులకై పోరాటానికి సిద్ధం కావాలి
- మహిళలకు సమాన పనికి - సమాన వేతనం ఇవ్వాలి
- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు

నవతెలంగాణ-మెదక్ టౌన్

మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పని ప్రదేశాలలో మహిళలకు రక్షణ కల్పించాలని, మహిళల హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కడారి నర్సమ్మ అన్నారు. ఆదివారం మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న నేటి దేశ పాలకులకు శ్రమన్నా, శ్రమ చేసే మహిళన్నా గౌరవం లేదని విమర్శించారు. మహిళా హక్కులు మానవ హక్కుల్లో భాగమనే విషయం మర్చిపోతున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం మహిళల హక్కులను హరిస్తుం దన్నారు. దేశవ్యాప్తంగా మహిళలు, పిల్లలపై లైంగిక దాడులు, హింస బాగా పెరిగి పోయిందని, మహిళలకు సమాన హక్కులు, శ్రమకు తగ్గ గుర్తింపు, సమాన పనికి సమాన వేతనం, చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ల అమలు, ఇవేవీ ప్రభుత్వాలకు పట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా కార్మికులు ఇటువంటి ఎన్నో సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉన్నామని ఆమె అన్నారు. ప్రభుత్వాలు మారినా మహిళల బతుకులు మారడం లేదని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. మహిళలు అభివృద్ధిలో, సంక్షేమంలో, స్వేచ్ఛ, సమాన త్వం, విద్యా వైద్యం, ఉపాధి, అన్ని రంగాలలో ముందుండి రాణిస్తున్నారన్నారు. ఆ విధంగా మహిళలకు ప్రోత్సాహకాలను ఇచ్చి ప్రభుత్వం మరింత ముందుకు నడిపించాలన్నారు. ఆ విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు.. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకురాలు యశోద, కవిత, స్వరూప, కవిత, రేణుక, రాణి, వరలక్ష్మి, వీరమని, రమాదేవి, మంజుల, లక్ష్మి సుజాత,రాజేశ్వరి, పాల్గొన్నారు.



రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టాలి

- విద్యార్థులకు రోజు వారి మెనూని పక్కాగా అమలు చేయాలి
- విద్యార్థులు ఉన్నత విలువలతో లక్ష్యాలను సాధించాలి
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్







నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాలలో పరిశుభ్రత చర్యలు చేపట్టాలని, విద్యార్థులకు రోజువారి మెనూ పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. ఆదివారం హవేలీ ఘనపూర్ మండలంలో మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనకబడిన తరగతుల రెసిడెన్షియల్ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా పరిశీలించారు. పాఠశాలల్లోని వంట గదిని పరిశీలించి, ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే వంట సరకులను నిల్వ చేసే గదిని తనిఖీ చేసి, పప్పులను, వంట నూనె, బియ్యాన్ని, కూరగాయలు, ఆకుకూరలు, తదితరాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అలాగే పాఠశాలల్లోని మరుగుదొడ్లు, మూత్రశాలలు, ప్రయోగశాలలు, తరగతి గదులను తనిఖీ చేసి, నిత్యం పరిశుభ్రతా చర్యలు చేపట్టాలన్నారు.ఈ క్రమంలో విద్యార్థుల హాజరు రిజిస్టర్, సరకుల నిల్వ రిజిస్టర్, వార్డెన్స్ హాజరు రిజిస్టర్, తదితరాలను తనిఖీ చేసి, ఈ రిజిస్టర్‌లో వివరాలను సరైన విధంగా నమోదు చేయాలని, వాటిని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అదే విధంగా విద్యార్థులతో ముమేకమై మాట్లాడి, ఎక్కడ నుంచి వచ్చారు. ఎలా చదువుతున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనాన్ని సమయానికి అందిస్తున్నారా వంటి వివరాలను అడిగి తెలుసుకుంటూ, వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించి, చక్కగా చదువుకొని ఉన్నత విలువలతో తమ లక్ష్యాలను సాధించాలని మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు

ఆలయ కమిటీ చైర్మన్‌గా పిల్లి శివకుమార్

- వైస్ చైర్మన్‌గా గొల్ల స్వామి

నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని పిల్లుట్ల గ్రామం భర్మస్వామి ఆలయ కమిటీ ఎన్నికలు గ్రామస్తుల సమక్షంలో ఆదివారం నిర్వహించారు. ఆలయ కమిటీ నూతన చైర్మన్‌గా పిల్లి శివకుమార్, వైస్ చైర్మన్ మంగళపర్తి స్వామి, కోశాధికారిగా తలారి అశోక్, డైరెక్టర్లుగా బెస్త కిష్టయ్య బోను పుల్లయ్య, సంద్ర లక్ష్మయ్య ఈరస్ లచ్చయ్య, గుర్రాల శంకర్, చింత మధు, కమ్మరి సురేష్, బొమ్మిరాల దశరథ, బుర్ర అనిల్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన ఆలయ కమిటీ గ్రామంలోని అన్ని ఆలయాలలో జరిగే ఉత్సవాలకు కూడ ప్రాతినిధ్యం వహిస్తుంది. కమిటీ పదవీ కాలం రెండు సంవత్సరాలు పాటు ఉంటుందని, ఉగాది పర్వదినం రోజున జరిగే భర్మస్వామి జాతర ఉత్సవాలను నూతన కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సహకారంతో నిర్వహించేందుకు గ్రామస్తులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ పిల్లి శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ భర్మస్వామి ఆశీస్సులతో గ్రామస్తుల సహకారంతో ఆలయాల అభివృద్ధితో పాటు జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు, పేరున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను గ్రామ పెద్దలు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దపులి రవి, మాజీ ఉపసర్పంచులు దామోదర్ రెడ్డి, చింత స్వామి, నర్సమ్మ దుర్గయ్య, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు రాఘవరెడ్డి, బండారి గంగాధర్, శ్రీధర్ గౌడ్, విద్యాకమిటీ చైర్మన్లు పిల్లి మధు, జింక వెంకటేష్, గౌడసంఘం మాజీ అధ్యక్షులు బుర్ర పెద్దపోచగౌడ్, బబ్బురి వెంకటేష్, పిల్లి కృష్ణ, ఏసాములు, మురళీగౌడ్, గణేష్, సుదర్శన్, శంకర్, మధు, గ్రామస్తులు పాల్గొన్నారు.



భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-మనోహరాబాద్

మండల కేంద్రంలో నిర్వహిస్తున్న శ్రీ కేతకి భ్రమరాంబ మల్లికార్జున స్వామి తొమ్మిదవ వార్షికోత్సవ ఉత్సవాలను యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ కేతకి భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయాన్ని విద్యుత్ కాంతుల దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. జాతర ఉత్సవాలలో భాగంగా సోమవారం మల్లన్న స్వామి లగ్గం అలాగే బండ్ల బోనాలు ఉంటాయని. మంగళవారం కొండపోచమ్మ బంగారమ్మ బోనాలు ఒగ్గు కథలు ఉంటాయని మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు యాదవ సంఘం నాయకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతర ఉత్సవాలకు మండలంలోని గ్రామాలతో పాటు ఇతర మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.





డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

నవతెలంగాణ-నర్సాపూర్

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారా నగర్‌లో నిర్మిస్తున్న డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా నర్సాపూర్ పట్టణంలో చేపడుతున్నారు. రిలే నిరాహార దీక్షలో భాగంగా ఆదివారం నర్సాపూర్ పట్టణానికి చెందిన ఆశన్న గారి దేవేందర్ యాదవ్, మహేష్ గౌడ్ , దయానంద్, నరేందర్ చారి మహేందర్ గౌడ్‌లు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చని అడవిలో కాలుష్యం అనే విషవాయువును నింపి పచ్చని అడవిని నాశనం పట్టించే ఈ డంపింగ్ యార్డ్ నిర్మాణం చేపట్ట వద్దన్నారు. డంపింగ్ యార్డ్ నిర్మాణం నిలిపితే వరకు ఉద్యమం కొనసాగిస్తామని వారన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని నిలిపి వేయాలన్నారు. ఈ దీక్షలో పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




పుస్తెమట్టెలు అందజేసిన మోహన్ నాయక్



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని షౌకత్ పల్లి తాండ గ్రామంలో రామావత్ రాజు బిబుజ్జి కూతురు అయినా సంధ్య పెళ్లికి పుస్తె మట్టెలు కోసం లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి వారి పెళ్లికి పుస్తె మట్టెలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను సంపాదించిన దాంట్లో కొంత పేద కుటుంబాలకు పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు సహాయం చేయడం జరుగుతుందన్నారు. కుల మతాలకతీతంగా నిరుపేదలకు పేదలకు సహాయం చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రామావత్ రాజు నాయక్, రామావత్ రాము నాయక్, మాడావత్ పత్తి నాయక్, మాడావత్ నరేష్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ మాడావత్ రాజు నాయక్, మాడవత్ మెగ్య నాయక్, మాడవత్ లాల్యా నాయక్, రామావత్ జైపాల్ నాయక్, రామావత్ లాల్య నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మైనంపల్లి హనుమంతరావు



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లక్ష్మణ్ గౌడ్ అన్న కూతురి వివాహానికి మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలోని నాయకులందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, నక్క ప్రభాకర్, మండల అధ్యక్షులు మారుతి, ఎంఎస్ఎస్ఓ మండల ఇన్చార్జి వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, పట్టణ అధ్యక్షులు ఎండి నసీరుద్దీన్, నార్లాపూర్ మాజీ సర్పంచ్ అమర సేనా రెడ్డి, టిపిసిసి అధికార ప్రతినిధి పల్లె రామచందర్ గౌడ్, మాజీ ఎంపీపీ సిద్ధిరాములు, లింగం గౌడ్, సత్య నారాయణ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ముత్యం రెడ్డి, లక్ష్మా గౌడ్, ఎల్లం యాదవ్, దేశెట్టి లింగం, సుప్రభాత రావు, మోహన్ రెడ్డి, రమేష్ రెడ్డి, మసూద్ అలీ, సరాఫ్ యాదగిరి, నర్సాపూర్ నరేష్, నార్లాపూర్ శ్రీశైలం, బాజీ రమేష్, నాగరాజు, రమావత్ వినోద్, శ్రీనివాస్, జెడ్చెరువు రాజు, బోయని చంద్రం, పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి

- బీజేపీ రాష్ట్ర నాయకులు పురం మహేష్ ముదిరాజ్

నవతెలంగాణ-మనోహరాబాద్



రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన ముదిరాజ్‌లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు పురం మహేష్ ముదిరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముదిరాజులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని వారికి అన్ని రంగాల్లో రాజకీయ పార్టీల్లో అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. 42 శాతం ముదిరాజ్‌లకు రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఏ ప్రభుత్వం అధికా రంలో ఉన్న ముదిరాజ్‌లకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముదిరా జులను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత కల్పిం చాలని విజ్ఞప్తి చేశారు. ముదిరాజులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వినియోగించుకుంటున్నారు. తప్ప ఏ రంగంలో కూడా వారికి ప్రాధాన్యత కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ముదిరాజులకు ప్రాధా న్యత కల్పించలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన ముదిరాజులకు అధిక ప్రాధాన్యత కల్పించి రిజర్వేషన్లను పెంచి స్థానిక సంస్థల్లో సీట్లు పెంచి కేటాయించాలన్నారు. ప్రస్తుతం రాజకీయాల్లో బీసీ ఐక్యత కోసం ఉద్యమం ఊపందుకుందని, ఈ తరుణంలో కూడా బీసీ వర్గానికి పెద్ద పీట వేయడంతో పాటు ముదిరాజులకు కూడా తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఏ విధంగా చూసిన ముదిరాజులే ఎక్కువ జనాభా ఓటర్లు ఉన్నారని కానీ అత్యున్నత స్థానాల్లో ఎక్కడా కూడా వారికి తగిన గుర్తింపు లేదన్నారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీల అధినేతలు, ప్రభుత్వాలు ముదిరాజులకు గుర్తింపు ఇచ్చి వారిని రాజకీయ ఆర్థిక రంగాల్లో ముందుకు తీసుకు పోవాలని అందుకు అందరూ సహకరించాలని కోరారు.

పేదింటి ఆడ బిడ్డలకు అండగా ఉండి ఆదుకుంటా

నవతెలంగాణ-నర్సాపూర్

నిరుపేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల పెళ్లిలకు తన వంతు సహాయం చేస్తానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరారెడ్డి అన్నారు. ఆదివారం నర్సాపూర్ మం డల పరిధిలోని అచ్చంపేట గ్రామానికి చెందిన రోటం బాలేష్ మణెమ్మ దంపతుల ద్వితీయ కూతురు వివాహానికి రఘువీరా రెడ్డి తన వంతు సహాయంగా పుస్తె మట్టెలు అందజేశారు. ఈ పుస్తె మట్టెలు గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు పెళ్లికూతురుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సీరిసు బిక్షపతి, పాల నరసయ్య, సంజీవులు, మల్లేశం, బాలేష్ సాయిలుఉన్నారు



మంత్రి పొన్నంకు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి



నవతెలంగాణ కొమురవెల్లి : రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆదివారం కొమురవెల్లిలో ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై వినతి పత్రం అందించారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రాబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి 30% నిధులు కేటాయించాలని లేఖలో పేర్కొన్నట్టు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని, కొమురవెల్లి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, బిసి,ఎస్సి హాస్టల్ ను ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామాలలో బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వారికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ పూర్తిస్థాయిలో విడుదల చేస్తామని అట్లాగే రాష్ట్రంలో విద్య రంగ సమస్యలు లేకుండా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లెనిన్ రాజ్ రాకేష్, సంజయ్ , మల్లికార్జున, శివ, తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి ఆదివారం ప్రారంభించాడు. దుద్దెడ, రాంపల్లి గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో కనీస వసతుల కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ప్రజల అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వాసరి లింగరావు, నాయకులు ఆనంతుల నరేందర్, కోయడ వెంకటేశం, సుదర్శన్, పర్శరాములు, కొమ్ము మల్లికార్జున్, సురేందర్, శ్రీకాంత్, సురేందర్, అంబటి రాజు, అంజయ్య సిద్దులు, వడ్లకొండ రాజు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

10వ తేదీ కలెక్టరేట్‌లో ప్రజావాణి

- జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినందున ఈ నెల 10వ తేదీ సోమవారం కలెక్టరేట్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం మను చౌదరి తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

అనారోగ్యంతో మహిళ మృతి



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని చేబర్తి గ్రామానికి చెందిన శమ్మని బాలమణి (40) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మర్కుక్ మాజీ జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రామచంద్రం యాదవ్, మర్కుక్ మాజీ వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డిలు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. వారి వెంట చేబర్తి మాజీ సర్పంచ్ ఎర్రబాగు అశోక్ , మర్కుక్ మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, చేబర్తి మాజీ ఉపసర్పంచ్ గుర్రాల స్వామి, తదితరులున్నారు.

లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో 14వ వార్షికోత్సవం





నవతెలంగాణ-సంగుసూరు

మండలంలోని పాలమాకుల గ్రామంలో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్లో 14 వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. 2024-25 పురస్కరించుకొని పిల్లలకు (కల్చరల్ కాంపిటీషన్స్) సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్ట్స్ అండ్ కల్చర్ సంబంధించిన ప్రైస్ డిస్ట్రిబ్యూషన్ చేశారు. ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖాధికారి తగిరెడ్డి దేశీ రెడ్డి, అతిథులుగా జిల్లా ఎడ్యుకేషన్ కల్చరల్ కమిటీ మెంబర్ పబ్బోజు రాజమౌళి, ట్రస్మా మెంబర్ సంతోష్, పాఠశాల ప్రిన్సిపాల్ వర్గీస్, డైరెక్టర్ పబ్బోజు సత్యనారాయణ, వాణిశ్రీ, ఆన్సి, మంజుల, టోజిన్, కరాటే మాస్టర్ సంతోశ్‌లు బహుమతులు అందజేశారు.

హరీష్ రావును విమర్శించవద్దు

- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్



నవతెలంగాణ-గజ్వేల్

మల్లన్న సాగర్ నిర్వాసితులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని వసతులను మాజీ మంత్రి హరీష్ రావు కల్పించినట్టు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి హరీష్ రావును విమర్శించవద్దన్నారు. కేసీఆర్ నాయకత్వంలో నిర్వాసితులకు అంతా న్యాయం జరిగిందన్నారు. మిగిలిపోయిన సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన కోరారు. గత ప్రభుత్వంలో రూ.170 కోట్ల రూపాయలు మంజూరు చేయగా వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని ఆయన గుర్తు చేశారు. మల్లన్న సాగర్‌లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని ఆయన కోరారు. ప్రతిపక్షాలపై విమర్శలు మానుకొని మల్లన్న సాగర్ నిర్వాసితుల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా ఉపయోగకరమైన పనులను గత ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, నాయకులు కనుకయ్య, రమేష్ గౌడ్, ఉమర్, మామిడి శ్రీధర్, నిజాముద్దీన్, శివకుమార్, హనుమంత రెడ్డి, హైమద్, అక్రమ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలో పాల్గొన్న చైర్ పర్సన్



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణ 26వ వార్డులోని శ్రీ అన్నపూర్ణ కాశి విశ్వేశ్వర దేవాలయంలో జరిగిన యంత్ర ప్రతిష్ట పూజ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు వారిని సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వడ్లకొండ సాయికుమార్, కళ్ళకుంట మల్లికార్జున్ పాల్గొన్నారు.

అయ్యప్ప దేవాలయంలో వార్షికోత్సవ వేడుకలు



- ప్రత్యేక పూజలు చేసిన మాజీ మున్సిపల్ చైర్మన్ రజిత

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలోని సిద్దేశ్వర గుట్టపై వెలసిన అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం 23వ వార్షికో త్సవ వేడుకలు మాజీ మున్సిపల్ చైర్మన్ రజిత వెంకన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యావచనం, అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకాలు, విశేష కార్యక్రమాలు, దివ్య పదునెట్టాంబడి పూజ, గణపతి హెూమం, తదనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దేవస్థాన చైర్మన్ ఆకుల వెంకట్, మున్సిపల్ మాజి చైర్మన్ సుద్దాల చంద్రయ్య, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి, కొండ్లె సంపత్, వాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కయ్యాలు.. కట్టడి అయ్యేనా..!

- పార్టీలోని వర్గాల పోరు రోడ్డుకెక్కింది



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో కయ్యాలు కట్టడి చేయాలని పార్టీ అధిష్టానం దృష్టి పెట్టింది. నామినేటెడ్ పదవుల విషయంలో ఇరువర్గాల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు ఇతర నామినేట్ పదవుల భర్తీకి డిసిసి అధ్యక్షులు నర్సారెడ్డికి పూర్తి బాధ్యత ఇవ్వడంతో, దానిని ఆశించిన నాయకులు నర్సారెడ్డిని వ్యతిరేకిస్తూ పిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు వర్గంలో చేరిపోయారు. దాంతో రెండు వర్గాల మధ్య 15 నెలలుగా ఉన్న పంచాయతీ రోడ్డుకి ఎక్కింది. సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి ఈ పంచాయతీ ఇప్పటికే వెళ్ళింది. ఇటీవల రాష్ట్రానికి కొత్త ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ రావడంతో త్వరలోనే ఇరువర్గాలను సమావేశం పరిచి ఏకతాటిపైకి తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తుంది.

రెండు వర్గాలుగా పార్టీ కార్యక్రమాలు

డిసిసి అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీ కాంతారావు వర్గాలు కొంతకాలంగా విభేదాలతో దూరంగా ఉంటున్నారు. పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఒకే కార్యక్రమాన్ని రెండు వర్గాలుగా విడిపోయి నిర్వహించడం పార్టీ కార్యకర్తల్లో అయోమయం నెలకొన్నది. ఇటీవల ఇరు వర్గాల నాయకులు ప్రెస్ మీట్‌లు పెట్టి మాటలు యుద్ధం ప్రారంభించారు.

పార్టీ నేతలను హెచ్చరించిన నటరాజన్

ఇటీవల రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ మెదక్ పార్లమెంటు నియోజకవర్గం డిసిసి అధ్యక్షులు ముఖ్య నాయకులతో ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో గట్టి వార్నింగ్ ఇచ్చారు. బహిరంగ ప్రెస్ మీట్‌లు పెడితే చర్యలు తీసుకుంటామని, అంతర్గత విభేదాలు ఉంటే గాంధీభవన్‌లో చర్చించుకోవాలి తప్ప బయట మాట్లాడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీకి కష్టపడ్డ వారికి మూడు నాలుగు కేటగిరీల వారికి న్యాయం చేస్తామని నాయకులకు కార్యకర్తలకు సూచించారు.

వర్గపోరు కోడై కూస్తుంది

2023 అసెంబ్లీ ఎన్నికల నుంచి నియోజకవర్గ ంలో కాంగ్రెస్ పార్టీలో రెండు గ్రూపులుగా విడిపోయి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఆ ఎన్నికల్లో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి టిక్కెటు దక్కింది. టికెట్ ను ఇద్దరు ముగ్గురు ఆశించినా ఫలితం లేకపోయింది. ఆ తర్వాత నియోజకవర్గంలో 15 నెలల కాలంలో గ్రూపుల గోల కొడై కోస్తుంది. పార్టీ అధిష్టానం ముందు నియోజకవర్గంలో జరుగుతున్న తీరును నర్సారెడ్డి వివరించారు.

మార్పు వస్తుందని ఆశిస్తున్న కార్యకర్తలు

మారుతున్న రాజకీయాల మూలంగా రాష్ట్రానికి నూతన ఇంచార్జ్ రావడంతో పార్టీలో క్షేత్రస్థాయిలో కూడా మార్పు వస్తుందని కార్యకర్తలు ఆశిస్తున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో గ్రూపుల్లో గోలను కట్టడి చేయాలని ప్రయత్నాలు ప్రారంభించింది. గ్రూపుల మూలంగా నామినేటెడ్ పదవులు ఇంకా కొన్నింటిని పూర్తి చేయలేకపోయింది. నియోజకవర్గంలో నెలకొన్న మనస్పర్థలు ఇలాగే కొనసాగితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి నష్టం జరిగే అవకాశం ఉందని భావిస్తున్న తరుణంలో ఎన్నికల ముందే ఇరు వర్గాలను కలిపి, పార్టీ బలోపేతం చేయడంపై పార్టీ అధిష్టానం దృష్టి పెట్టింది.

గట్టు రవి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే హరీశ్ రావు



నవతెలంగాణ-సిద్ధిపేట

పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త గట్టు రవీందర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన మృతి పట్ల మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సంతాపం వ్యక్తం చేశారు. రవీందర్ మృతి బాధాకరమని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిద్దిపేట వైశ్య భవన్ అధ్యక్షునిగా పని చేశారని, వైశ్య సంఘం బలోపేతంకు కృషి చేసారని, నిత్యం సమాజ బాగుకోసం పరితపించే వారన్నారు. ఆధ్యాత్మిక ధార్మిక సేవలో ముందు ఉండి, సామాజిక సేవలో భాగస్వామ్యం అవుతూ, కొండపాకలోని ఆనందం నిలయం, అష్టాదశ అమ్మవారి దేవాలయ, సత్య సాయి ట్రస్ట్ సేవలో ఎంత గానో కృషి చేశారని, రవీందర్ చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వైశ్య భవనం మాజీ అధ్యక్షులు గట్టు రవీందర్ మృతి చాలా బాధకరం అని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్ అన్నారు. గట్టు రవీందర్ ఆర్యవైశ్య భవనం అధ్యక్షులుగా, సత్య సాయి సేవా సమితి ద్వారా, ఆనంద నిలయం వృద్ధఆశ్రమంలో సేవలు అందించారన్నారు. రవీందర్ కుటుంబ సభ్యులకు మనో ధైర్యం ప్రసాదించాలని ఆ భగవంతున్ని కోరుకున్నారు. రవీందర్ మృతి పట్ల సంతాపం తెలిపిన వారిలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యుడు అయిత రత్నకర్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి మంకాల నవీన్ కుమార్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి గంప కృష్ణ మూర్తి, జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పుల్లూరి శివకుమార్, డివిజన్ కన్వీనర్ చింత రాజేంద్ర ప్రసాద్ ఉన్నారు.

గురుకులాలకు రూ.11 వేల కోట్లు మంజూరు

- హర్షం వ్యక్తం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ లకు రూ. 11 వేల కోట్లు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి దశలో 55 నియోజకవర్గాల్లో ఒక్క యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కి రూ.200 కోట్లు చొప్పున నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు రూ.200 కోట్లు కేటాయించడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌లు కార్పొరేట్ స్కూల్‌లకి ధీటుగా విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలు అందించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు, సాంకేతికత విద్యా కంప్యూటర్, సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర శిక్షణ కోర్సులను ఈ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా అందించనున్నారు.

సంస్కృతి సాంప్రదాయాలను పాటించాలి

- విద్యార్థులచే తల్లిదండ్రులకు పాదాభివందనం



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

తల్లిదండ్రులను గౌరవించడం మనందరి సంస్కృతి అని టిస్మార్ట్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జగ్గ మల్లారెడ్డి అన్నారు. క్రాంతి పాఠశాలలో ఆదివారం ప్రత్యక్ష దైవాలకు పాదాభివందనం పేరిట విద్యార్థులచే తల్లిదండ్రులకు పాదాభివందనం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో సమాజం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదవడంతో పాటు పెద్దలను తల్లిదండ్రులను గౌరవించడం నేర్చుకోవాలని అప్పుడే ఉన్నత స్థాయిని చేరుకుంటారన్నారు. పాఠశాల చైర్మెన్ అర్పిత భగవాన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పించడం మన అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి, జర్నలిస్టు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, సెక్టోరియల్ అధికారి భేతి భాస్కర్, అడ్వైజర్ మహేందర్, వందలాది సంఖ్యలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మల్లన్న భక్తుల కష్టాలు పట్టించుకునే వారేరి



- 8 వారాలుగా మురుగు నీటి ప్రవాహం
- మురుగు నీటి లో వెళ్తూ మల్లన్న దర్శనం
- మల్లన్న, ఎల్లమ్మ లకు బోనాల సమర్పణ
- పట్టించుకోని ధర్మకర్తలు ఆలయ అధికారులు





నవతెలంగాణ - కొమురవెల్లి

కోరిన కోర్కెలు తీర్చే కొమురవెల్లి మల్లన్న భక్తుల కష్టాలను పట్టించుకునే వారే కరువయ్యారు. స్వామివారి కోడెల మండప సమీపంలో డ్రైనేజ్ పైపులైను పగిలి 8 వారాలుగా మురుగునీటిలోనే భక్తులు ఒక్కపొద్దుతో ముక్కు మూసుకుని బోనాలు ఎత్తుకొని కాలినడకన ప్రయాణం చేస్తు స్వామి వారి దర్శనం కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఆలయ అధికారులు, ధర్మకర్తలు ఈ సమస్య నాకెందుకు అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఆలయ పరిసరాలలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రతి వారం ఏదో ఒక చోట ఆలయ పుర వీధులలలో మురుగునీరు లీకై రోడ్డుపై ప్రవహించడం పరిపాటిగా మారింది. గ్రామపంచాయతీ పరిధిలో ఈ పని పూర్తి చేయాలని ఆలయ అధికారులు, ఆలయ అధికారులే ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్యదర్శి ఒకరిపై ఒకరు సమస్యను నెట్టేసుకుంటూ 8 వారాలుగా నెట్టుకొస్తున్నారు భక్తులు, స్థానికులు సమస్యను పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా భక్తుల కష్టాలు పట్టించుకోని అధికారుల మనసు మార్చు స్వామి అంటూ కొందరు భక్తులు కోరుతున్నారు. అధికారుల సమన్వయ లోపం వల్ల మురుగునీటి సమస్య ఎన్నటికీ పరిష్కారం అవుతుందో వేచి చూడాల్సిందేనా స్వామి.

సింగం సత్తయ్యకు సన్మానం



నవతెలంగాణ-మర్కుక్

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల పరిధిలోని పాములపర్తిలో ఇటీవల బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన సీనియర్ బీజేపీ నాయకులు సింగం సత్తయ్యకు ఆదివారం బీజేపీ మర్కుక్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాయిరెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన సింగం సత్తయ్యకు చిరు సన్మానం చేయడం జరిగిందని, పార్టీకోసం కష్టపడే ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని మర్కుక్ మండలంలో బీజేపీ బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు. అందరితో కలిసి మెలిసి ఉంటూ బీజేపీ అభివృద్ధి కోసం పాటుపడుతున్న సింగం సత్తయ్య రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు స్వీకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ మండల బీజేపీ మాజీ అధ్యక్షులు రమేష్, ఉపాధ్యక్షులు మహేష్ గౌడ్, అశోక్, ఉప్పరి నరేష్, తాండ స్వామి, పాతూరు కుమార్, తదితరులున్నారు.

మర్కుక్‌లో ఎమ్మార్పీఎస్ డప్పుల ప్రదర్శన



నవతెలంగాణ-మర్కుక్

జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికలోని లోపాలను సరిచేసి ఎస్సీలలోని అన్నికులాలకు ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందేలా ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఎమ్మార్పీఎస్ మర్కుక్ మండలాధ్యక్షులు ఎం.రమేష్ మాదిగ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన మర్కుక్‌లో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మర్కుక్ మండలకేంద్రంలో ఆదివారం డప్పుల ప్రదర్శన నిర్వహించారు. త్వరలో జరుగబోయే మంత్రివర్గ విస్తరణలో మాదిగ ఎమ్మెల్యేలకు ఇద్దరికి ప్రతినిత్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను 3 గ్రూపులు కాకుండ నాలుగు గ్రూపులు ఏబీసీడీలుగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మర్కుక్ గౌరవ సలహాదారులు కర్రోళ్ల నర్సింలు మాదిగ, ప్రధానకార్యదర్శి బక్కల శరత్ బాబు మాదిగ, ఉపాధ్యక్షులు మరిగాళ్ళ ప్రసాద్ మాదిగ, ఇప్పలగూడెం గ్రామ అధ్యక్షులు నవీన్ మాదిగ ,రాజు,బాను చందర్, మర్కుక్, దామరకుంట, చేబర్తి, శివారు వేంకటాపూర్ గ్రామాల నాయకులు, తదితరులున్నారు.

వీరభద్ర స్వామి విగ్రహం ప్రతిష్ట మహెూత్సవం

- ఎమ్మెల్సీ మధుసూదనా చారి



నవతెలంగాణ-సిద్దిపేట

చిన్నకోడూరు మండల కేంద్రంలోని శ్రీ వీరభద్ర స్వామి విగ్రహం ప్రతిష్ట మహెూత్సవంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనా చారి పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట ప్రజలు అదృష్టవంతులని కేసీఆర్, హరీష్ రావు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారని, రాష్ట్రంలో అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ సిద్దిపేట నిలుస్తుందన్నారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కరించబడని సమస్యలను, చాలా సమస్యలను కేసీఆర్ పరిష్కరించారన్నారు. ఆయన హయంలో చెరువులు, కుంటలు నీటితో నిండి గ్రామాలకు సాగునీరు అందిందని, పంటలు సమృద్ధిగా పండాయన్నారు. విగ్రహ ప్రతిష్ట మహెూత్సవంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నా న్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్, గంగాపూర్ సొసైటీ చైర్మన్ కనకరాజు, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు ఉమేష్ చంద్ర, ఎంపిటిసిల ఫోరం మాజీ మండల అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షులు కీసరి పాపయ్య, నాయకులు పానుగంటి రమేష్, జంగిటి శ్రీనివాస్, విశ్వబ్రాహ్మణుల మండల అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పరవశించిన మల్లన్న భక్తులు

- జోరుగా సాగిన 8వ వారం
- పట్నాలు వేసి బోనాలు చెల్లింపు
- దర్శనానికి 4 గంటల సమయం



నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎనిమిదో ఆదివారం జాతరకు భక్తులు వేలాదిగా పోటెత్తారు. ఆలయ పరిసరాలన్నీ జనసంద్రంతో నిండిపోయాయి. తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో స్నానమాచరించిన భక్తులు మల్లన్నకు బోనం నివేదించి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు కోరిన కోరికలు నెరవేర్చాలని గంగరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. అనంతరం శీఘ్ర, అతి శీఘ్ర, ధర్మ దర్శనాల ద్వారా క్యూ క్యూలైన్లలో వెళ్లి దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనానికి సుమారు 4 గంటల సమయం పట్టింది. అనంతరం విజయచల గుట్టపై ఉన్న ఎల్లమ్మ తల్లికి బెల్లం పానకం కల్లుసాక పోసి బోనాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. కమిటీ సభ్యులు, ఆలయ ఈవో రామాంజనేయులు, ఆలయ సూపరిండెంట్, బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్ ఏర్పాట్లను పరిశీలించగా హుస్నాబాద్ ఏసిపి సతీష్ ఆధ్వర్యంలో చేర్యాల సిఐ ఎల్ శ్రీను కొమురవెల్లి ఎస్ఐ రాజు భారీ బందోబస్తు నిర్వహించారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన కారు

- భార్యాభర్తలకు గాయాలు



నవతెలంగాణ-కొండపాక

అదుపు తప్పి కారు చెట్టుకు ఢీ కొట్టిన సంఘటనలో భార్యా భర్తకు తీవ్ర గాయాలైన సంఘటన కొండపాక శివారులో రాజీవ్ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.హైదరాబాద్ సనత్ నగర్ ప్రాంతంకు చెందిన సందీప్, అనిలా భార్యా భర్త ఇద్దరు కలిసి హైదరాబాద్ నుంచి ధర్మపురి దేవా దర్శనానికి వెళుతుండగా కొమురవెల్లి కమాన్ దాటాక కొండపాక శివారులో గౌరాయపల్లి స్టేజి వద్ద వీరి కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. దాంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కొండపాక 108 సిబ్బంది మెడికల్ టెక్నీషియన్ మహేందర్, పైలట్ మహేష్ ఘటన ప్రాంతానికి చేరుకుని గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం | 10 మార్చి 2025 | www.navatelangana.com

గోటి తలంబ్రాల దీక్ష అమోఘం

- ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

భద్రాచల సీతారాముల కళ్యానానికి అందించే గోటి తలంబ్రాల దీక్షలో ఆదివారం ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి దంపతులు పాల్గొని రామనామ స్మరణ చేస్తూ గోటితో వడ్లను వలిచారు. అనంతరం శ్రీరామకోటి వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజుకు అందజేసి రామభక్తిని చాటుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ తమ చేతులతో ఓలిచిన ఈ గోటి తలంబ్రాలు భద్రాచల కల్యానానికి వెళ్లడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి పుణ్య కార్యక్రమంలో తమను కూడా బాగ స్వాములను చేసిన రామకోటి రామరాజు కృషి, పట్టుదల అమోగమన్నారు. గ్రామ, గ్రామాన లక్షల మంది భక్తులచే ఓలిపించి 250కిలోల తలంబ్రాలు భద్రాచలం అందించడం అయన రామభక్తికి నిదర్శనం అన్నారు.

ఘనంగా ప్రారంభమైన 55వ వార్షికోత్సవాలు

నవతెలంగాణ-సిద్ధిపేట



శ్రీ వేంకటేశ్వర స్వామి సేవా సమితి వారి ఆధ్వర్యంలో పాత వెంకటేశ్వర దేవాలయ 55 వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగముగా రెండవ రోజు గో పూజ, మూలమంత్ర హవనం, శ్రీ భూ నీలా సమేత వెంకటేశ్వరస్వామి వార్లకు 108 కళాశాల్లో పంచామృతాలు, సుగంధ ద్రవ్యాకు, పండ్ల రసాలు నింపి వాటికి పూజలు చేసి, అభిషేకాలు చేశారు. తదుపరి భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఎదురుకొల్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు సిద్దిపేటకు మైనంపల్లి రాక

నవతెలంగా-సిద్ధిపేట

సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో జరగనున్న ముఖ్య కార్యకర్తల సమావేశానికి మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హాజరవుతున్నట్లు సమాచారం. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి నియోజకవర్గంలోని ముఖ్య కార్యకర్తలు హాజరుకానున్నారని, స్థానిక సంస్థల ఎన్నికలు, ఇతర అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తుంది.

పాలిటెక్నిక్ కళాశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ జీఎంఆర్ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థిగా కళాశాల సమస్యలను పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగపురి ప్రీతం అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో ఉన్న జీఎంఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి పూర్వ విద్యార్థిగా ఆయన హాజీరై మాట్లాడారు. ఎస్సీకార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన తొలిసారిగా ఇక్కడనే నిద్ర చేశానని అనేక సమస్యలు తన దృష్టికి వచ్చినట్లు వాటిని దశలవారీగా పరిష్కారం చేస్తానన్నారు. గత ప్రభుత్వం ఎస్సీలకు సంబంధించిన జీఎంఆర్ కళాశాల అయినందున అప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. దళితుల విద్యార్థుల పట్ల కేసీఆర్‌కు చిత్తశుద్ధి లేదని జీఎంఆర్ కళాశాల తీరును చూస్తే అర్థమైందన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. రానున్న కాలంలో పైన నిధులు కేటాయించి హాస్టల్ మరమ్మతులు చేపడతానన్నారు.1985 లో ఏర్పడ్డ జీఎంఆర్ కళాశాలలో తాను తొలి విద్యార్థిని ఎంతోమంది ఐపీఎస్, ఐఏఎస్లు ఇతర శాఖలో స్థిరపడ్డ వారు ఉన్నారని ఆయన గుర్తు చేశారు. తామంతా నాలుగు దశాబ్దాల తర్వాత కలిసినట్లు అనేక విషయాలను నెమరు వేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఎంతోమంది విద్యావంతులను గజ్వేల్ జీఎంఆర్ కళాశాల అందించిందని ఆయన వివరించారు.

తోర్నాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

మండల పరిధిలోని తోర్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-2005 సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి పూర్వ ఉపాధ్యాయులు నరసయ్య కిష్టయ్య వెంకటేశం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు వివిధ స్థాయిలో ఉన్నవారు అందరూ హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు..ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చాలా సంవత్సరాల తర్వాత అప్పట్లో చదువుకున్న మిత్రులను కలవడం చాలా సంతోషకరమన్నారు. ఈ పాఠశాలల్లో చదివిన కొందరు ప్రభుత్వ, ప్రైవేటు, రాజకీయ రంగాల్లో రాణిస్తున్నామని క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులకు సన్మానం చేశారు.

కార్పొరేటర్ సింధుకు హరీశ్‌రావు శుభాకాంక్షలు

నవతెలంగాణ-రామచంద్రాపురం



భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం హరీశ్‌రావు నివా సానికి వెళ్లి కార్పొరేటర్ సింధు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కార్పొరేటర్‌ను ఆశీర్వదించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని సూచించారు. కార్పొరేటర్‌తో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శ రెడ్డి ఉన్నారు.

ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు



నవతెలంగాణ-సంగారెడ్డి

విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యం అని ఎస్‌టీఓ శారదా అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ షెడ్యూల్ కులాల బాలుర వసతిగృహం ఆనంద నిలయంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధత పై ఆదివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టి.శారద మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలు అంటే భయపడకుండా ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలన్నారు. ప్రస్తుతం ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్షలు రాసే విధానం, చదువులో మెలికల గురించి, పరీక్షా సమయంలో తీసుకోవాల్సిన మిత ఆహారం గురించి తెలియజేస్తూ విద్యార్థులు పరీక్షకు ఎలా సన్నద్ధం కావాలనే విషయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు నాగేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

తపాస్ పల్లి సాగు నీటిని విడుదల చేయాలని వినతి

నవతెలంగాణ-కొండపాక



తపాస్ పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలంలో పలు గ్రామాల చెరువులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ రఘునందన్ రావుకు రైతులు వినతిపత్రం అందజేశారు. తపాస్ పల్లి డి ఫోర్ కాల్వ ద్వారా మండలంలోని పలు గ్రామాలకు గతంలో చెరువులను నింపారని, ప్రస్తుతం నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందన్నారు. ఈ విషయంలో ఎంపీ రఘునందన్ రావు సంబంధిత అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయాలని ఆదేశించినట్లు వారు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల రైతులు, నాయకులు ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు.

మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయండి

- సిపిఐ (ఎం) గజ్వేల్ మండల కార్యదర్శి సందింటి రంగారెడ్డి.

నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ మండలంలో పెండింగ్ పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం మోక్షం కల్పించి మౌలిక సదుపాయాలు కల్పిం చాలని సీపీఐ (ఎం) గజ్వేల్ మండల కార్య దర్శి రంగాారెడ్డి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో అనేక గ్రామాల్లో సిసి రోడ్లు, మౌలిక సదుపా యాలు లేకపో వడం వల్ల ప్రజలు ఇబ్బం దులు గురవు తున్నారు. అంతేకాకుం డా ఉపాధి కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించాలని ఆయన కోరారు. ఉపాధి కూలీలకు సామాగ్రిని ప్రభుత్వం సమకూర్చాలన్నారు. గడ్డపార, పారా, వేసవికి ఎండలకు టెంట్లు వెంటనే ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. అంతేకాకుండా వైద్యానికి సంబంధించిన బాక్స్ అందుబా టులో ఉండాలని సూచించారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఉపాధి కూలీలకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయా లని కోరారు. అదేవిధంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో పెండింగ్ పనులు రింగు రోడ్డు పూర్తి చేస్తే గజ్వేల్ పట్టణంలో ట్రాఫిక్ తగ్గుతుం దన్నారు. అదేవిధంగా ఇందిరా పార్కు, కోట మైసమ్మ రోడ్డు ను వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు విస్తరణ లు ఇండ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ పథకంలో అవకాశం కల్పించి రోడ్డు పూర్తి చేయాలని ఆయన కోరారు. విషయంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు జోక్యం చేసుకోవాల న్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా ప్రతి రైతుకు అందేలా చూడాలన్నారు. గజ్వేల్ మండ లంలో కొందరికి రైతులకు రైతు భరోసా వచ్చిం దని ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను గజ్వేల్ మండలంలో ప్రతి ఇంటికి అమలు జరగాలని ఆయన కోరారు. మల్లన్న సాగర్ నిర్వాసి తుల విషయంలో రాజకీయ పార్టీలు రాజకీయం చేయకుండా వారికి కావలసిన స్మశాన వాటికలు, పూర్తి ప్యాకేజీ, ప్లాట్లు, చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఇంతవరకు మల్లన్న సాగర్‌పై ఎందుకు దృష్టి పెట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రాయపోల్‌లో ఎమ్మార్పీఎస్ డప్పుల ప్రదర్శన

నవతెలంగాణ-రాయపోల్



రాయపోల్ మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పులతో భారీగా తరలివచ్చి ఆదివారం మండల కేంద్రం రాయపోల్‌లో ప్రదర్శన నిర్వహించారు. సూపర్ మార్కెట్ నుంచి అంబే ద్కర్ విగ్రహం, చాకలి ఐలమ్మ విగ్రహం, తెలంగాణ తల్లి విగ్రహం ప్రాంతాల నుంచి ప్రధాన విధుల గుండా ర్యాలీ నిర్వహించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షులు అయ్యగల్ల రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుర్ర నర్సింలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ షేమిమ్ అక్తర్ కమిషన్ నివేదికలో ఎస్సీ వర్గీకరణ విషయంలో కొన్ని అవకతవకలు జరిగాయని, అవి సరి యైన మార్గంలో సవరణలు చేసి మాదిగల జనాభా ప్రాతి పదిక ప్రకారం తొమ్మిది శాతం కాకుండా 11 శాతం రిజర్వే షన్ అమలు చేయాలన్నారు. గ్రూపులుగా కాకుండా ఏ, బి, సి, డి లుగా వర్గీకరించా లన్నారు. మాదిగ ఎమ్మెల్యేలకు క్యాబినెట్లో రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బందా రం సంతోష్, ప్రధాన కార్యదర్శి టెంకంపేట నర్సింలు, తాజా మాజీ సర్పంచ్ రామొల్ల స్వామి, చిరంజీవి, మండల కోశాధికారి లక్ష్మణ్, తుడుం నర్సింగరావు, ప్రకాష్,సాయిలు, అయ్యగల్ల రవి, వివిధ గ్రామాల అధ్యక్షులు తుడుం స్వామి, డప్పు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికపురోభివృద్ధి సాధించాలి

నవతెలంగాణ-దౌల్తాబాద్



మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించినప్పుడే సమాజంలో గౌరవం పొందుతారని ఏఆర్డిఓ జిల్లా ఇంచార్జ్ రజిని పేర్కొన్నారు. ఆదివారం దౌల్తాబాద్ మండల పరిధిలోని మల్లేశం పల్లి గ్రామంలో ఏఆర్డిఓ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో నైపుణ్యం సాధించుకొని ఆర్థి కంగా నిలదొ క్కుకోవడానికి దారులను వెతుక్కోవాలని సూచించారు. అంగన్వాడి నుండి అంతరిక్షం దాకా మహిళలు అనేక అద్భుత విజయాలు సాధిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నైపుణ్య శిక్షణ లేక గ్రామీణ ప్రాంతాలలో మహిళలు ఉపాది .లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాంటి వారి ఇబ్బందులు తీర్చడానికే సంస్థ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఇస్తున్నామని తెలిపారు. దీనిని గ్రామీణ ప్రాంత మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రాజు రెడ్డి, పలువురు నాయకులు మహిళ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కొండపాక



మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలో అంబేద్కర్ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవ ర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొమ్ము లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా పల్లె రాజశేఖర్, కోశాధికారిగా బాకీ రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా పిల్లి అశోక్, కొమ్ము నర్సిం లు, సహాయ కార్యదర్శులుగా బాకీ కరుణాకర్, పల్లె సురేష్, క్రీడల కార్యదర్శిగా కాటపాక సంపత్, ప్రచార కార్యద ర్శులుగా రోషిలి నాగరాజు చినిగారి రామకృష్ణ, సాంస్కృతిక కార్యదర్శిగా పల్లె బాబు, కార్యనిర్వాహణాధికారిగా బండ మీది గోపాల్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ... సంఘ అభివృద్ధి కొరకు అహర్ని శలు పాటు పడతామని, బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అట్టహాసంగా పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ మండలం సంగాపూర్ గ్రామంలో ఆదివారం జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం అట్టహాసంగా కొనసాగింది. 1988-2021 బ్యాచ్లకు చెందిన పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనాన్ని ఆనందో త్సవాల మధ్య నిర్వహించారు. 25 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలవడంతో వారి అనుభ వాలను ఒకరినొకరు పంచుకున్నారు. ప్రస్తుతం వారు ఉం టున్న హోదాలను వేదిక ద్వారా పరిచయం చేశారు. చదు వుకున్న రోజుల్లో చేసిన చిలిపి చేష్టలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు అలింగనాలు చేసుకున్నారు. పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని పురస్కరించుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహా సమ్మేళనాన్ని పురస్క రించుకొని పాలిటెక్నిక్ కళాశాలలో అప్పటి రోజుల్లో పని చేసిన ప్రిన్సిపాల్తో పాటు లెక్చర్లను పూర్వ విద్యార్థులు శాలువాలతో సత్కరించారు. పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని విజయవంతం కావడం పట్ల ప్రోగ్రాం కన్వీనర్ మ్యాజిక్ భాస్కర్ మీడియా కోఆర్డినేటర్ జంగం బాల ప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు. సమ్మేళనానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పరిమళించిన పాతికేళ్ల బంధం

నవతెలంగాణ-దుబ్బాక



25 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థిలోకం అంతా ఒక్కచోట చేరి నేస్తమా కుశలమా అంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఇందుకు దుబ్బాక మున్సిపాలిటీ పరిధి లోని లచ్చపేట ప్రాథమిక పాఠశాల వేదికైంది. 1999-2000 లో లచ్చపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ఆదివారం గెట్ టూ గెదర్ ద్వారాఆత్మీయంగా కలుసుకున్నారు. చదువుచెప్పిన గురువులను శాలువాలు కప్పి పాదాభివందనం చేశారు. అంతకుముందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంద ర్భంగా సహచర మహిళా విద్యార్థినీలకు బహుమ తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నకోడూర్ ఎం ఈఓ ఎస్.యాదవరెడ్డి, ఉపాధ్యాయులు సీ.నారాయణ, వేణు గోపాల్ రెడ్డి, జగదయ్య శ్రీనివాస్, మలారెడ్డి, ఉదయ్ కు మార్, శివకుమార్ శర్మపలువురు విద్యార్థులు పాల్గొన్నారు

బుద్ధుని బోధనలు శాంతికి మార్గం

- బౌద్ధ బిక్కు నాగభూషణం బంతే

నవతెలంగాణ-దౌల్తాబాద్



బుద్ధుడు ప్రవచించిన శాంతి సహనం కరుణ నేటి సమాజానికి ఎంతైనా అవసరమని ప్రముఖ బౌద్ధ ఆధ్యాత్మికవేత్త నాగభూషణం బంతే పేర్కొన్నారు. ఆదివారం దౌల్తాబాద్ మండల పరిధిలోని సూరంపల్లి గ్రామంలో నిర్వహించిన బౌద్ధ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధకాంక్షలు అని ప్రపంచం, అసమానతలు లేని సమాజం బుద్ధుని ఆలోచన విధానంతోనే సాధ్యమవుతాయని పేర్కొన్నారు. మారుతున్న ఆధునిక జీవన విధానంలో బుద్ధుని బోధనలు నేటి సమాజానికి బుద్ధుని బోధనలు ఎంతగానో అవసరం ఉన్నాయన్నారు. బౌద్ధం ఒక మతం కాదని మానవ విలువ లతో, మానవత్వంతో కూడుకొని ఉన్న ఒక జీవన విధాన మని పేర్కొన్నారు. ఉరుకులు పరుగుల జీవితములో సాం త్వన కరువైన తరుణంలో బుద్ధుని వాక్కు నేటి సమాజానికి అవసరం ఉందని తెలిపారు. నేటి యువత బుద్ధుని మార్గంలో ప్రయాణించడం ద్వారా మానసిక ప్రశాంతత పొందడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక మంలో శృతి పూలే ఫౌండేషన్ చైర్మన్ ఉప్పర మల్లేశం, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జక్కుల వెంకట్, ప్రముఖ కవి రాచ కొండ, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేదాం మౌర్య, నమస్తే తెలంగాణ బ్యూరో రిపోర్టర్ బండారు రాజు, ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్, బుద్ధిష్టి సొసైటీ ఆఫ్ జిల్లా అధ్యక్షులు ఎనగందుల శంకర్, ప్రధాన కార్యదర్శి ముత్యాల నర్సింలు, బిఎస్ఐ జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు సావుల రాజమౌళి, పుట్ట రాజు, తిరుపతి, జర్నలిస్ట్ శంభు లింగం, చెన్న రాజు, మహేందర్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించినందుకు విద్యార్థి బలవన్మరణం

నవతెలంగాణ-వర్గల్



తల్లి మందలించడంతో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలం లోని చాంద్ ఖాన్ ముక్త గ్రామంలో జరిగింది. పోలీసులు కుటుం బసభ్యు లు తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్ ఖాన్ ముక్త గ్రామానికి చెందిన విజయేందర్ రెడ్డి (16) చౌదర్ పల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతు న్నాడు. గురువారం రోజున వారి వ్యవసాయ పొలం వద్దకు విజయేందర్ రెడ్డి వెళ్లగా అతనిని వారి తల్లి చదువుకోకుండా ఎందుకు తిరుగుతున్నావు? అని మందలించడంతో విజయేందర్ రెడ్డి వారి వ్యవసాయ పొలం వద్ద ఉన్న పురుగుల మందును తాగాడు. స్థానికుల సహా యంతోవిజయేందర్ రెడ్డిని తల్లిదండ్రులు గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. అక్కడి డాక్టర్ల సూచనమేరకు హైదరా బాద్‌లోని ఓ ప్రైవేటు ఆసు పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి 1 గంటకు మరణిం చారు. మృతు డి తల్లి కనకవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూసైడ్ కేసు నమోదు చేసినట్లు గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపారు.


గట్టు రవి మృతి చాలా బాధాకరం

- మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్

నవతెలంగాణ-సిద్ధిపేట

సిద్దిపేటకు చెందిన ప్రముఖ వ్యాపార వేత్త, ఆధ్యాత్మిక, సామాజిక సేవా నిరతుడు గట్టు రవీందర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరమని మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రవీందర్ మృతి దిగ్భ్రాంతి కి గురించేసిందని, రవీందర్‌తో చాలా ఏళ్లుగా అనుబంధం ఉందన్నారు. ఎవరికి ఏ సహాయం అవసరమున్నా సహాయం చేసే వాడని, చనిపోయే చివరి నిమిషం వరకు కూడా ఆయన సేవా కార్యక్రమాల్లో ఉన్నారని గుర్తు చేశారు. రాంగ్ రూట్‌లో వచ్చిన వ్యక్తి రవీందర్ బైక్‌ను ఢీకొట్టడం వల్ల ఈ ప్రమాదం జరగడం విషాదమని, ఆయన కారులో వెళ్లి ఉంటే మరణం సంభవించి ఉండేది కాదని, బైక్‌లపై వెళ్ళినప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ లను ధరించాలని కోరారు. గట్టు రవి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవము



నవతెలంగాణ-మర్కుక్

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో గల సీతారాముల కళ్యాణ మహోత్సవము కన్నుల విందుగా అంగరంగ వైభవంగా ఆదివారం జరిగింది. 14వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా కళ్యాణ మహోత్సవానికి రాష్ట్ర ఆటవీ కార్పొరేషన్ శాఖ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సింగం సత్తయ్య, బీజేపీ మర్కుక్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి, కళ్యాణానికి హజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాచారం ఆలయ మాజీ చైర్మన్ శబ్బవీసు హన్మంతరావు దంపతులు కల్యాణం నిర్వహించారు, అనంతరం మురికి శ్యాంసుందర్ గుప్తా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఎంపీపీ తాండ పాండు గౌడ్, జడ్పీటీసి యెంబరి మంగమ్మ రాంచంద్రం,మాజీ సర్పంచ్ కనకయ్య,ఉపాధ్యాక్షులు టి.మహేష్ గౌడ్,బీజేపీ మర్కుక్ మాజీ మర్కుక్ మండలాధ్యక్షులు టి.రమేష్ గుప్తా, వెంకటేష్, తాండ శ్రీనివాస్ గౌడ్, స్వామి గౌడ్,తదితరులున్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ

నవతెలంగాణ-సిద్ధిపేట



సిద్దిపేట ఆర్య వైశ్య భవనం మాజీ అధ్యక్షులు గట్టు రవి రోడ్డు ప్రమాదంలో స్వర్గస్తులైన విషయం తెలుసు కుని, వారి కుటుంబ సభ్యులను మెదక్ ఎంపీ మాధవనేని రఘు నందన్ రావు పరామర్శించి, ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

ఎల్‌ఆర్ఎస్‌పై రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-జహీరాబాద్

ఎల్ఆర్ఎస్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 25శాతం రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు అన్నారు. ఈనెల 31వరకు ఈ అవకాశం ఉంటుందని తెలిపారు. కాగా ఇప్పటివరకు 9944 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఔవఎంట్వ.శ్రీతీర్.వశ్రీఖఅ-ప్రుఖఖ.ప్రశీజ.ఊఅ వెబ్‌సైట్‌లో లాగిన్ చేసి ఫీజు చెల్లించాలన్నారు.